1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 02, 2024 | www.navatelangana.com

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంజేపీ విద్యార్థుల ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్ : అండర్ - 14 రగ్బీ జిల్లా స్థాయి పోటీలను ఇటీవల పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల(బాలుర) పాఠశాలకు చెందిన లఖన్, యువరాజ్, బాపురావు, ఈశ్వర్, ప్రదీప్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ గోపిచంద్ అభినందించారు. ఈ నెల 3న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిన్సిపాల్ రాగం రంగన్న, డీడబ్ల్యూ జ్యోతి, ఏటిపి హరికృష్ణ కుర్మే పీఈటీ శివన్న పాల్గొన్నారు.



సర్పంచుల సేవలు మరువలేనివి

నవతెలంగాణ-నిర్మల్

గ్రామాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన సర్పంచుల సేవలు మరువలేనివని ఎంపీటీ షేక్ కలీం అన్నారు. సోన్ మండలం కడ్తాల్ గ్రామ సర్పంచ్ బర్మ లక్ష్మి రాజ నర్సయ్య పదవీ కాలం గురువారం ముగియడంతో గ్రామ పంచాయితీకి సొంత ఖర్చులతో ట్రాక్టర్‌ను వితరణ చేశారు. ఐదేళ్ల కాలంలో గ్రామస్తులకు చేసిన సేవ ఎంతో సంతృప్తి నిచ్చిందని సర్పంచ్ అన్నారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు గ్రామ పాలక మండలిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



పోరుగడ్డ నుంచే రణభేరి..!

ఉద్యమాల పురిటిగడ్డగా పిలిచే ఇంద్రవెల్లి నుంచే కాంగ్రెస్ మళ్లీ ఎన్నికల రణ నినాదాన్ని వినిపించనుంది. రానున్న లోక్‌సభ ఎన్నికలకు ఇక్కడ్నుంచే సమాయత్తం కావాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి రానున్నారు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో తొలిసారి ఇక్కడే దళిత, గిరిజన దండోరా పేరిట భారీ స్థాయిలో సభ నిర్వహించగా.. కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. ఆయనే ముఖ్యమంత్రి కావడంతో అదే సెంటిమెంట్‌ను అనుసరిస్తూ సీఎం హోదాలోనూ తొలిసారి ఇక్కడే భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి అమరుల స్థూపం వద్ద తెలంగాణ పునర్నిర్మాణం పేరిట నిర్వహించే ఈ సభకు భారీ స్థాయిలో జన సమీకరణ చేపట్టేందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధమయ్యాయి. మరోపక్క కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అనంతరం ఇంద్రవెల్లి స్థూపం వద్ద స్మృతి వనం పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

- నేడు ఇంద్రవెల్లికి సీఎం రేవంత్‌రెడ్డి
- టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇక్కడే తొలి సభ
- లోక్‌సభ ఎన్నికలకూ ఇక్కడ్నుంచే సమాయత్తం
- భారీ స్థాయిలో బహిరంగ సభ నిర్వహణకు కసరత్తు
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఇంద్రవెల్లి పోరుగడ్డపై కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల రణ నినాదాన్ని వినిపించనుంది. రెండేండ్ల క్రితం టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ఇక్కడ్నుంచే సమాయత్తమయ్యారు. దళిత, గిరిజన దండోరా పేరిట భారీ స్థాయిలో నిర్వహించిన సభ విజయవంతమైంది. లక్షలాది మంది జనం తరలిరావడంతో రాష్ట్రంలో ఈ సభకు మంచి క్రేజ్ ఏర్పడింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే నమ్మకం కలిగించింది. అందరూ అనుకున్నట్టుగానే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారాన్ని కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ పదేండ్ల పాలనకు చరమగీతం పాడింది. నెలన్నర క్రితం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి అదే రోజున ఇంద్రవెల్లి అమరుల స్థూపం వద్ద స్మృతివనం ఏర్పాటుచేస్తామని హామీనిచ్చారు. ఇదే క్రమంలో త్వరలోనే లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా వీటిలోనూ సత్తాచాటాలని కాంగ్రెస్ భావిస్తోంది. అదే సెంటిమెంట్‌ను అనుసరిస్తూ లోక్‌సభ సమరానికి సైతం ఇంద్రవెల్లి నుంచే రణభేరి మోగించేందుకు సిద్ధమవుతున్నారు. సీఎం హోదాలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పాటు భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా ఎన్నికల శంఖారావాన్ని కూడా పూరించనున్నట్లు తెలిసింది.

భారీ జన సమీకరణకు కసరత్తు..!

ఇంద్రవెల్లి సభను విజయవంతం చేసేందుకు భారీ స్థాయిలో జన సమీకరణ చేపట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దనసరి అనసూయ(సీతక్క) రెండు రోజుల నుంచి జిల్లాలోనే ఉంటూ నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలకు జన సమీకరణ బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు లక్ష మందిని ఈ సభకు తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో సభ నిర్వహించడం ద్వారా లోక్‌సభ ఎన్నికలకు జనం దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లేలా మరింత సానుకూల వైఖరి ఏర్పడుతుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మాదిరిగానే లోక్‌సభ సీట్లు అధికంగా గెలిచి కేంద్రంలోనూ అధికారం కైవసం చేసుకునేందుకు సిద్ధమవుతోంది.



పలు అభివృద్ధి పనులకు శ్రీకారం..!

ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి ఆదిలాబాద్ జిల్లాకు రానున్న రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. మధ్యాహ్నం 1.35గంటలకు ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌కు చేరుకోనున్న సీఎం నాగోబా ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ గోపురం, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడి దర్బార్ హాల్‌లో మధ్యాహ్నం 2.15గంటల నుంచి 3.15గంటల వరకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3.30గంటలకు ఇంద్రవెల్లి స్థూపం వద్ద స్మృతివనం నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం అక్కడే నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. మరోపక్క ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా ఇదే సభలో మరో రెండు గ్యారెంటీలను కూడా అమలు చేసేలా నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్..!

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. శుక్రవారం పార్లమెంటులో కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఎలాంటి కేటాయింపులు దక్కలేదు. కేంద్ర బడ్జెట్‌పై అనేక ఆశలు పెట్టుకున్న జిల్లా వాసులను మళ్లీ నిరాశకు గురిచేసింది. అనేక ఏండ్లుగా ప్రతిపాధనలకే పరిమితమైన ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణంపై ఎలాంటి ప్రకటన లేకపోవడం.. ఆదిలాబాద్‌లో మూతపడిన సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ.. నూతనంగా విమానశ్రయ ఏర్పాటుపైనా ఎలాంటి ప్రస్తావన లేకపోవడం జిల్లావాసులను తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. కేవలం దేశవ్యాప్తంగా అమలయ్యే సంక్షేమ పథకాలకు తప్పితే..కొత్తగా చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించ లేదు. దీంతో ప్రతి ఏటా మాదిరిగానే కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు.

- ప్రస్తావన లేని ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్
- సీసీఐ, విమానాశ్రయ ఏర్పాటుపైనా ఊసెత్తని వైనం
- అన్నదాతలకు పెరగని పెట్టుబడి సాయం
- ఉమ్మడి జిల్లాకు కనిపించని కేటాయింపులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులను అసంతృప్తికి గురి చేసింది. లోక్‌సభ ఎన్నికల సమయం కావడంతో కనీసం ఈ సారైనా జిల్లాకు కేటాయింపులు, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరుచేస్తారని ఆశపడిన జనాలకు నిరాశే మిగిలింది. చివరకు ఎలాంటి తీపి ప్రకటన లేకుండానే బడ్జెట్ ఉండటంతో జిల్లావాసులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ముఖ్యంగా ఏండ్లుగా నానుతున్న ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం మంజూరైనా నిధులు కేటాయించకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయింది. దీంతో ఉమ్మడి జిల్లావాసులు అనేక రోజుల నుంచి ఈ లైన్ ప్రారంభించాలని కోరుతున్నారు. తాజాగా జిల్లా కేంద్రంలో ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ పేరిట రిలే దీక్షలు సైతం చేపడుతున్నారు. కానీ కేంద్రం నుంచి ఎలాంటి రైల్వేలైన్ ఎలాంటి ప్రస్తావన కనిపించలేదు. మరోపక్క ఆదిలాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో మరో వందేండ్ల పాటు సిమెంటు ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన సిమెంట్ పరిశ్రమ సైతం పునరుద్ధరణకు నోచుకోవడం కష్టంగా మారుతోంది. ఈ పరిశ్రమను తెరిపించాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. గత ఎన్నికల సమయంలో ఈ పరిశ్రమను తెరిపిస్తామని హామీనిచ్చినా..నెరవేర్చటంలో మాత్రం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విఫలమవుతోంది. తాజా బడ్జెట్‌లోనూ ఈ పరిశ్రమ తెరిపించడంపై ప్రకటన చేయలేదు. మరోపక్క ఆదిలాబాద్‌లో విమానశ్రయ నిర్మాణానికి అన్ని అనుకూలతలు ఉన్నా. కేవలం ప్రతిపాధనలకే పరిమితమవుతోంది. దీనిపైనా ఎలాంటి భరోసా దక్కలేదు.

పెరగని పెట్టుబడి సాయం..!

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి ఏడాదికి రూ.10వేల సాయం అందిస్తోంది. ఈ సాయంతో అన్నదాతలకు భరోసా దక్కుతోంది. కేంద్రప్రభుత్వం సైతం ఎకరానికి రూ.6వేల చొప్పున ఏడాదిలో మూడు విడతలుగా అందిస్తోంది. ఈ సాయాన్ని కేంద్రం రూ.9వేలకు పెంచుతోందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. అన్నదాతలు సైతం ఎంతో ఆతృతగా ఎదురుచూశారు. రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగానే..కేంద్రం సైతం మరింత అదనంగా పెట్టుబడి సాయం అందిస్తే వ్యవసాయం సులువుగా మారుతుందని రైతులు ఆశపడ్డారు. కానీ కేంద్రప్రభుత్వం ఈ పెట్టుబడి సాయం పెంపుపై తాజా బడ్జెట్ సందర్భంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. మిగతా రంగాలకు సైతం బడ్జెట్ అంతగా ఆశాజనకంగా లేదని ఆయా వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

సొనాల మండల తుడుందెబ్బ అధ్యక్షుడిగా మారుతి

నవతెలంగాణ-బోథ్

సొనాల మండల తుడుం దెబ్బ అధ్యక్షుడిగా జుగ్నక్ మారుతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని పార్డి-బి గ్రామంలో రాష్ట్ర కార్యదర్శి కొడప గణేష్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మారుతి మాట్లాడుతూ తనకు పదవి కట్టబెట్టినందుకు ఆదివాసుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మెస్రం భూమన్న, లక్ష్మణ్, లాలురామ్, సంగ్రామ్ పాల్గొన్నారు.



విద్యారంగం గురించి అబద్ధాలు మాట్లాడిన ఆర్థిక మంత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విద్యారంగం గూర్చి అబద్ధాలు మాట్లాడారని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అభిప్రాయపడుతోందని జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్య సంబంధిత ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీ నుండి ప్రభుత్వం 5 శాతానికి తగ్గించిందని, కాని తాము ఆయా వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయాలని కోరుతున్నామన్నారు. మంత్రి ప్రసంగంలో ఉన్నత విద్యారంగంలో విద్యార్థినుల గ్రాస్ ఎన్రోల్మెంట్ 28శాతం పెరిగిందని, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43శాతం నమోదైందని, ఇదే ప్రపంచంలో అత్యుత్తమమైనదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థినుల చదువుల పట్ల అంకిత భావంతో లింగ సమానత్వం కోసం పనిచేస్తుందనడం ఒట్టి బూటకపు మాటలని పేర్కొన్నారు. 2014లో బిజెపి అధికారం చేపట్టిన నాటి నుండి విద్యార్థినులు చదువులకు దూరమయ్యారని తెలిపారు. కేంద్ర విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందని, ప్రతి ఏటా విద్యార్థినుల డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. నూతన జాతీయ విధానం ద్వారా రాష్ట్రాల హక్కులను లాక్కొని విద్యపై కేంద్రం పూర్తి స్థాయి నియంత్రణ కోసం ప్రయత్నిస్తోందన్నారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని కోరారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.రాజమణి అన్నారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా గురువారం ఐసిడిఎస్ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయిందని, కార్మికుల రక్షణ కొరకు ఉన్న 44 చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా తీసుకొచ్చిందని తెలిపారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి చెల్లింపు తదితర ఏ ఒక్క సమస్య కేంద్ర ప్రభుత్వం పరిష్కరించలేదని విమర్శించారు. ఈ విధానాలను నిరసిస్తూ ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి శైలజ, సహాయ కార్యదర్శి దేవిక, జిల్లా నాయకులు లావణ్య, భాగ్య, గంగవ్వ, లక్ష్మి పాల్గొన్నారు.



క్రిటికల్ స్థితిలో ఉన్న గర్భిణీకి సురక్షిత ప్రసవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కళ్లెం భూమారెడ్డి ఆసుపత్రిలో క్లిష్టమైన స్థితిలో ఉన్న ఓ గర్భిణీకి సురక్షిత ప్రసవం చేశారు. పట్టణంలోని కోలిపురకు చెందిన కృష్ణవేణికి పురిటి నొప్పులు రావడంతో చంద్రపూర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్లేట్‌లెట్స్ 10వేలు మాత్రమే ఉండడంతో చికిత్సకు నిరాకరించారు. హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడం, నొప్పులు తీవ్రతరం కావడంతో కళ్లెం భూమారెడ్డి ఆసుపత్రిలో ఈ నెల 26న చేర్పించారు. డా.జీవిత వెంకట్‌రెడ్డి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. నార్మల్ డెలివరీ చేయగా ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మూడు రోజుల పాటు మెరుగైన చికిత్స అందించి ప్లేట్‌లెట్లను సాధారణ స్థితికి తీసుకొచ్చారు. సోమవారం ఆమెను డిశ్చార్జి చేశారు. దీంతో ఆమె కుటుంబీకులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మించాలి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం పరిధిలో గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. గురువారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా భీమారం మండలం పరిధిలోని గ్రామ పంచాయతీల ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎమ్మెల్యేను కలిశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

లక్సెట్టిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని ఉత్కూర్, లక్సెటిపేట, దౌడపల్లి, పోతపల్లి, ఫీడర్స్ మరమ్మత్తుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ గణేష్ తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఓఏఐ అధికారులకు గుర్తింపు ధ్రువపత్రాల అందజేత



నవతెలంగాణ-నస్పూర్

ఇటీవల అధికారుల సంఘం ప్రత్యక్ష ఎన్నికలలో విజయం సాధించిన శ్రీరాంపూర్ ఏరియా అధికారులకు జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి గుర్తింపు ధ్రువపత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపొందిన వారికి అభినందనలు తెలియజేస్తు అధికారులకు సంబంధించిన పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. ఏరియా ప్రెసిడెంట్‌గా కె.వెంకటేశ్వర్‌రెడ్డి, సెక్రటరీగా చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్లుగా లక్కాకుల మహేష్, కిరణ్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా షేక్ మహమ్మద్ గౌస్ పాషా, ఆర్ భీమన్న, ట్రెజరర్‌గా బానోత్ రాము, జాయింట్ ట్రెజరర్‌గా కోటేశ్వరరావు విజయం సాధించడం అభినందించదగిన విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘు కుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు ఎం.శ్రీనివాస్, వి.పురుషోత్తమరెడ్డి, డీజీఎం (ప) పి అర్విందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, శ్రీరాంపూర్ ఏరియా ఏజెంట్లు ఏవి రెడ్డి, గోపాల్ సింగ్, రాముడు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీవైసీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు, పర్సోజ్ ఎస్ఈ చంద్రశేఖర్, అన్ని గనుల మేనేజర్లు, అన్ని విభాగాల అధికారులు, గనుల గ్రూప్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కార్మెల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ - హాజీపూర్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని గుడిపేట్ మౌంట్ కార్మెల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బుధవారం నస్పూర్‌లోని సాధన పాఠశాలలో జరిగిన జిల్లా జూనియర్ లెవెల్ అథ్లెటిక్ పోటీల్లో మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన మధు వర్షిత 100 మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ మెడల్, 4 రౌండ్ల పరుగులో రబియ సిల్వర్ మెడల్, 300 మీటర్లు, 4 రౌండ్ల పరుగు పందెంలో మధు వర్షిత రెండవ సిల్వర్ మెడల్ సాధించారు. వీరికి పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఆల్ఫీ, పీఈటీ నరేందర్ అభినందించారు.

నేటి సీఎం సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బేల

నేడు జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభకు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఇన్‌చార్జి పటేల్ రమేష్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రలో గురువారం పర్యటించారు. ప్రజల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని, ఆరు గ్యారెంటీ హామీలు ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని అన్నారు. వెంటనే రెండు హామీలు అమలు చేసి చూపించామన్నారు. అతి త్వరలోనే మరో రెండు అమలు కానున్నాయన్నారు. రేవంత్‌రెడ్డికి ఇంద్రవెల్లి సభ గుర్తుండిపోయేలా సక్సెస్ చేయాలన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుండి ఇరవై వేలకు తక్కువ కాకుండా తరలిరావాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలలో ఓడినప్పటికీ అంతకుముందు అభ్యర్థులకంటే ఎక్కువ ఓట్లు సాధించగలిగామన్న సంతృప్తి ఉందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్యనే ఉంటానని, నిరంతరం నియోజకవర్గ ప్రజలకు సేవకే అంకితమవుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, అడ్డి భోజరెడ్డి, ఫైజుల్లాఖాన్, రాందాస్ నాక్లే, శంకర్, సంజయ్ గుండావార్ పాల్గొన్నారు.

దళిత ఉపాధ్యాయుడిపై దాడికి ఖండన

నవతెలంగాణ-ఆదిలాబాద్

లక్కారం గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సామ్యూల్‌పై దాడి చేసిన రాకేష్, అనుచరులపై చర్య తీసుకోవాలని అన్నాబావుసాఠె అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోరె నర్సింగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సామ్యూల్‌కు న్యాయం జరగకపోతే ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో తెలంగాణ పాలిటెక్నిక్ ఎస్సీ, ఎస్టీ అధ్యాపక సంఘ 2024 క్యాలెండర్‌ను ప్రిన్సిపాల్ పి.భరద్వాజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురువారం అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు డీటీ నాయక్, కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌లతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అధ్యాపక సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పోస్ట్ లాన్ అసోసియేషన్ అధ్యక్షులు వీరస్వామి, కార్యదర్శి శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

నవతెలంగాణ-తలమడుగు

గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని ఉండం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శేషారావు బుధవారం రాత్రి చాతిలో నొప్పి రావడంతో అదే రోజు రాత్రి రిమ్స్‌కు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. గత కొద్ది సంవత్సరాల క్రితం మహారాష్ట్ర నుంచి జీవనాధారం కోసం సుంకిడి గ్రామానికి చెందిన వ్యక్తి దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మృతుడు డ్రైవర్ శేషారావు ఉండం, సుంకిడి గ్రామాలకు చెందిన గ్రామ ప్రజలతో కలిసి మెలిసి ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండు గ్రామాల ప్రజలు వారి కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు.



6న ఆల్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

6న ఆల్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా సదస్సు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఇతర వామపక్ష కార్మిక సంఘాల జిల్లా నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె విజయవంతం కోసం పలు అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. 6న విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఇంటింటికి కరపత్రం తీసుకెళ్లి బీజేపీ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 16న జిల్లా కేంద్రంలో, మండల కేంద్రాల్లో కార్మిక ప్రదర్శన, ధర్నా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం చేశామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం వెనక్కి తీసుకొచ్చి ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు బ్యాంక్ అకౌంట్‌లో వేస్తామని అన్నారు. మాయ మాటలు చెప్పి గద్దె నెక్కిన మోడీ ప్రభుత్వం తీరా నిరుద్యోగం, 50 సంవత్సరాల కాలానికి వెనక్కి నెట్టిందని విమర్శించారు. ప్రపంచ దేశాలలో ఆకలిలో 111వ స్థానం, మానవ అభివృద్ధి 132 స్థానం, రూపాయి విలువ పతనం, ధరలు 56 శాతం పెరిగాయన్నారు. పెట్రోల్ ఉత్పత్తులపై అధిక శాతం పన్నుల వాట పెంచారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ విధానం ద్వారా వంద శాతం అమ్మకానికి పెట్టారని విమర్శించారు. నాలుగు బొగ్గు బ్లాక్‌లను విదేశాలకు విక్రయించారన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులను పూర్తిగా హరించి వేశారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ బోర్డ్‌లను నిర్వీర్యం చేశారన్నారు. 8 గంటల పని విధానం రద్దు, యాజమాన్యాలకు, కార్పొరేట్ కంపెనీలు ఇష్టానుసారం వదిలి వేశారన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు రూ.2.14 లక్షల కోట్ల రుణ మాఫీ చేశారన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక అంశాలపై ఇంటి ఇంటికి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రచారం నిర్వహించాలని కోరారు. సమావేశంలో వామపక్ష కార్మిక సంఘం నాయకులు ఎస్ఎన్ రెడ్డి, శ్రీనివాసచారి, బక్కన్న, రామలక్ష్మణ్, హరిత, పోశెట్టి పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



నవతెలంగాణ-తాంసి

గ్రామాభివద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకంగా ఉంటుందని, సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు వచ్చేలా కృషి చేస్తానని జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, ఎంపీడీవో ఆకుల భూమయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో వారిని అధికారులు, ఎంపీటీసీలు, పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంతో పాటు ప్రజలకు ఎల్లవేళలా సేవలందిస్తూ గ్రామాభివృద్ధిలో కీలకంగా మారారన్నారు. ప్రభుత్వం అధికారులు ఆదేశించిన ప్రతి పనినీ సకాలంలో పూర్తి చేశారని అన్నారు. ప్రజలకు సేవ చేయడానికి పదవి ముఖ్యం కాదని, సర్పంచులు పెండింగ్ బిల్లుల విషయంలో ఆందోళనకు గురికావద్దని తెలిపారు. పెండింగ్ బిల్లులు వచ్చేలా కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురకుంటి మంజుల శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు స్వప్న రత్న ప్రకాష్, సదానందం, వెంకన్న, తూర్పు బాయి, యశ్వంత్, అండె అశోక్, అలాలి జ్యోతి నర్సింగ్, కుంట సరిత, కేశవ్‌రెడ్డి, మునేశ్వర్ భరత్, ఎంపీఓ సుధీర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఎంపీటీసీ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత 5నుంచి 6నెలలుగా వేతనాలు అందడం లేదని గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లింబద్రికి పారిశుధ్య కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామ పంచాయతీలో ఉన్న పలు పనులను ఎప్పటికపుడు పరిశుభ్రం చేసి, గ్రామాలను సస్యశామలంగా తీర్చిదిద్దిన మాకు కనీస వేతనాలు కూడా సరియైన సమయానికి అందించకుండా నెలల పాటు పెండింగ్‌లో ఉంచడంతో మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ స్పందించి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు రావాల్సిన వేతనాలు వెంటనే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల మండల సంఘం అధ్యక్షుడు సాయినాథ్ ఉపాధ్యక్షుడు గంగాధర్, కార్మికులు రాంకిషన్, అర్జున్, బాబన్న, జయవంత్ ఉన్నారు.

టీఏవీఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా కమిటీని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా యూ.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శిగా కుంరం సంతోష్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడారు. జిల్లాల్లో అనేక పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ తీసుకొని పోరాటానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.శేఖర్, బి.సంతోష్, భీంరావు, పవన్ పాల్గొన్నారు.

స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్

స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సీనియర్ కంటి వైద్యులు ఉప్పు కృష్ణంరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దివ్యాంగులందరూ మనోధైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. వైకల్యం అనేది శారీరక పరమైనదని కానీ, మనోధైర్యానికి అడ్డుకాదన్నారు. వైకల్యాన్ని లెక్కచేయకుండా ఎవరు సాధించని ఉన్నత శిఖరాలను సాధించిన దివ్యాంగులు ఎందరో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ, మండల ప్రధాన కార్యదర్శి గంగారాం పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం కల్గకుండా చూడాలి

నవతెలంగాణ-ముథోల్

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ సూచించారు. ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విద్యుత్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. చిన్న చిన్న సమస్యలు, మరమ్మత్తులు వస్తే వెంటనే పూర్తి చేయాలని అన్నారు. విద్యుత్ సమస్య వల్ల మిషన్ భగీరథకు ఇబ్బంది కలగవద్దన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఏడీ, ఏఈ పాల్గొన్నారు.

పాఠశాలలో తగు సౌకర్యాలను కల్పిస్తాం..

మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తగు సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం చించాల పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించిన గదులు వర్షాకాలంలోపై కప్పు నుంచి వర్షం నీరు వస్తుందని, అలాగే ప్రహరీగోడ కల్పించాలని, వర్క్ అడ్జెస్ట్ కింద ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలకు వచ్చేలా చూడాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులకు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తప్పకుండా ముందుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నర్సాగౌడ్, టి.రమేష్, కోరి పోతన్న, శివరాం, ఉపాధ్యాయులు రాజారెడ్డి, గంగాధర్, రాజశేఖరచారి, భోజబాయి, వనజ, పాఠశాల చైర్మెన్ శంకర్, గ్రామస్తులు ఉన్నారు.

నేడే సీఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ

- ముందుగా నాగోబా దర్శనం
- దర్బార్ హాలులో పొదుపు సంఘం మహిళలతో ముఖాముఖి
- అక్కడే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏర్పాట్లను పరిశీలించిన ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం
- ఇక్కడి నుంచే పార్లమెంటు ఎన్నికల శంఖారావం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అయిన తరువాత తొలి సారిగా మండలంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి సభ ఏర్పాట్ల కోసం జిల్లా ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. గురువారం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో పాటు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావ్, వివిధ కాంగ్రెస్ నాయకుల సభావత్ శ్రీనివాస్ నాయక్, నరేష్ జాదవ్ హీరాపూర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సభాస్థలాన్ని పర్యవేక్షించారు. ఉదయం 11.30 ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో నేరుగా నాగోబా ఆవరణలో దిగనున్నారు. ముందుగా నాగోబాకు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. దాని తరువాత నాగోబా దర్బార్ హాలులో పొదుపు సంఘం మహిళలతో ముఖాముఖి చేపట్టి వారితో మాట్లాడుతారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఐటీడీఏల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకిస్తారు. ఇక్కడే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. అక్కడి నుంచి నేరుగా ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని అమరవీరులకు నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా 1981 ఏప్రిల్ 20న జల్, జంగిల్, జమీన్ (భూమి, భుక్తి, అడవి) కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరుల కుటుంబాలకు కలువనున్నారు. రూ.93లక్షలతో స్మృతి వనానికి భూమిపూజ చేయనున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభాస్థలం వద్ద ప్రజలను ఉద్యేశించి మాట్లాడనున్నారు. ఈ సభ సక్సెస్ కోసం ఆ పార్టీ నాయకులు వివిధ గ్రామాల నుంచి ప్రజలను సభకు తీసుకువచ్చేందుకు నిమగ్నయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా భారీగా కటౌట్‌లు ఏర్పాటు చేశారు.

భారీగా ఏర్పాటు చేసిన కటౌట్‌లు, ఫ్లెక్సీలు..

సీఎం రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు, భారీగా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా ప్రజలను సభకు తరలించేందుకు ఏర్పాట్లను చేశారు. ఈ సభ పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇంద్రవెల్లి నుంచే శంఖారావాన్ని పూరించనున్నారు. ఎంపీ ఎన్నికల దృష్ట్యా ఇంద్రవెల్లిలో రోడ్డుకు ఇరువై భారీగా కటౌట్‌లు ఏర్పాటు చేయడంలో పాటు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.



ఎమ్మెల్యేను కలిసిన ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును ఆదిలాబాద్ ప్రయివేట్ డిగ్రీ కళాశాల యజమాన్య బృందం సభ్యులు ఆయన నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. శుక్రవారం సీఎం పర్యటన సందర్భంగా ఈ విషయం దృష్టిలో ఉంచాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీఎంఏ బృందం సభ్యులు మల్లారెడ్డి, హనుమాండ్లు, అజీమ్ వేముగంటి వరప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీఓకు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలాభివృద్ధి కార్యాలయంలో గత కొద్ది సంవత్సరాలుగా పనిచేసిన ఎంపీఓ దిలీప్ కుమార్ జైనథ్ మండలానికి బదిలీ కాగా భీంపూర్ మండలం నుంచి తలమడుగు మండలానికి కొత్తగా బదిలీపై వచ్చిన ఎంపీఓ వినోద్‌ను గురువారం మండల కేంద్రంలో మండల సిబ్బంది తోపాటు పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల సిబ్బంది సూపరింటెండెంట్ జమీల్, నగేష్, ఉమా, పంచాయతీ కార్యదర్శులు సుజాత, రంజిత్ రెడ్డి, అభయ్ కుమార్, వినోద్ కుమార్, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

- 17వ రోజుకు రైల్వేలైన్ సాధన కమిటీ దీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ సాధన సమితి పిలుపు మేరకు గురువారం విద్యాసంస్థల బంద్ పాటించారని అది విజయవంతమైందని అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ వద్ద రైల్వేలైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగగా గురువారం 17వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా 17వ రోజు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తుగానే పలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. అక్కడక్కడ తెరిచి ఉన్న పాఠశాలలను సాధన సమితి, విద్యార్థిసంఘాల నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా రైల్వే సాధన సమితి చైర్మెన్ నారాయణ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ ప్రతిపాదన పెండింగ్‌లో ఉందన్నారు. ఈ పార్లమెంట్ సమావేశంలోనే ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బంద్‌కు సహకరించిన విద్య సంస్థల యజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, సమితి సభ్యులు ఉన్నారు.



దీక్షలకు కాంగ్రెస్ నాయకుల మద్దతు..

ఇదిలా ఉంటే అటూ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఆర్‌అండ్ బీ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష 17వ రోజుకు చేరుకోగా కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ నాయక్ సంఘీభావం తెలిపారు. పోరాటం చేస్తున్న సమితి సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ ప్రతిపాదన వస్తున్న కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే పనులను ప్రారంభించేలా కేంద్రం చొరవ చూపాలన్నారు. అటు గొర్ల కురుమ ఆధ్వర్యంలో సమ్మెకు సంఘీభావం ప్రకటించారు.

ప్రమాదకరంగా రోడ్డు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని రాంపూర్ నుంచి పొచ్చర మీదుగా కప్పర్ల వెళ్లే బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు మొత్తం గుంతలమయంగా ఏర్పడినప్పటి సంబంధిత అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో జిల్లా కేంద్రానికి తమ పనుల నిమిత్తం రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదిలాబాద్‌కు కూతవేటు దూరంలో రాంపూర్, పొచ్చర గ్రామాల రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి చెప్పనక్కరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో గత రెండు నెలల కింద పాఠశాలకు వెళ్లే విద్యార్థుల ఆటో బోల్తా పడింది. అందులో చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా ఈ మార్గం గుండా అధిక లోడ్‌తో వాహనాలు తిరుగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బంటుందని పేర్కొంటున్నారు. అదేవిధంగా ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనాలు తరుచూ మోరాయిస్తున్నట్లు, తరుచూ రిపేర్లు చేయించుకుంటున్నట్టు వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డును బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-కుభీర్

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బీజేపీ కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా గావ్‌చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కుభీర్‌లోని శివసాయి ఆలయంలో మండల బీజేపీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గావ్‌చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రవాసి కార్యకర్త ముందుగా కేటాయించిన గ్రామాలలో ఈనెల 5, 6, 7, 8లలో ప్రతి రోజు ఉండి పార్టీ కార్యకర్తలతో కలిసి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. విద్యావంతులను, రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగస్తులు, ఇతర పార్టీల నాయకులను కలిసి మాట్లాడి, పాఠశాలలను సందర్శించాలన్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. అదే విధంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ విజయం సాధించే దిశగా, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని అన్నారు. అంతకుముందు విఠలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, ఆలయ కమిటీ అధ్యక్షుడు నారా పరుశురాం, సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఆలయానికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.గంగాధర్, బి. విఠల్, వి.నగేష్, కనకయ్య, నాగేందర్, దత్తాత్రి, గులాబ్, బి. శంకర్, సత్యనారాయణ, కందూర్ దత్తు పాల్గొన్నారు.

మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీహార్ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు కర్పూరి ఠాగూర్‌కి ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని భారత ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన సందర్భంగా నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ లక్ష్మణచాంద మండల బీజేపీ నాయకులు, మోడీ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు నాగుల రాజు కుమార్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, నవీన్, క్రాంతి, సంపత్, సత్తెన్న, వినేష్, నాయి బ్రహ్మణ కులస్థులు, ఓబీసీ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు ఫిబ్రవరి 1 నుండి 29 వరకు పోలీస్ ఆక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు చేయవద్దన్నారు. నిషేదిత ఆయుధాలు కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థలు, నేరాలకు ఉసిగొలిపే ఆయుధాలను వాడరాదన్నారు. లౌడ్ స్పీకర్, డీజే వంటివి నిషేదమన్నారు. 30 ఆక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నియమ నిబంధనలు విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, మిలిటరీ అధికారులకు, హోంగార్డులు, అంత్యక్రియ ఊరేగింపులకు వర్తించవని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్ల కాపరి మృతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్ల కాపరి దేవా నగేష్ (18) మృతి చెందిన ఘనట గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శీర్ష గ్రామానికి చెందిన దేవానగేష్ గోర్లు మేపటానికి మండల కేంద్ర సమీపంలోని పొలాలలో వచ్చి తాగునీటి కోసం బావి వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాళుజారి నీళ్లలో పడిపోయడు. గమనించిన రైతులు బయటకు తీశారు. అప్పటికే మరణించినట్లు తెలిపారు. తండ్రి దేవా గుట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేసా మొబైలైజర్ వేతనాలు పెంచడం హర్షణీయం



నవతెలంగాణ-కెరమెరి

పేసా మొబైలైజర్ సేవలను గుర్తించి గౌరవ వేతనాలను పెంచడం హర్షణీయమని పేసా మొబైలైజర్ కమిటీ మండల అధ్యక్షుడు మడావి భరత్ భూషణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొన్నేళ్లుగా ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆదివాసీ గిరిజన ప్రజలకు అవగాహన కల్పించడం, వారి చైతన్యానికి అహర్నిశలు కృషి చేసినట్లు తెలిపారు. పేసా మొబైలైజర్లు తక్కువ గౌరవ వేతనంతో పని చేస్తున్నారని ఇటీవల మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లామన్నారు. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చొరవతో రూ.2500 నుంచి రూ. 4000 పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా మొబైలైజర్ కమిటీ తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేసా మొబైలైజర్లు ఆడ ఆనంద్ రావు, కుర్సెంగ యాదవరావు, మెస్రం భాపూరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవన ఆవరణలో బోర్‌వెల్‌కు భూమి పూజ చేసి అనంతరం సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తన జీవితాన్ని ప్రభుత్వ సేవలు అందించడంలోని గడిపిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ అలీబీన్ అహ్మద్, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణా గౌడ్, నాయకులు వెంకన్న, లింగన్న పాల్గొన్నారు.

సర్సిల్క్ స్థలాల ఆక్రమణలు ఆపాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని సర్సిల్క్ ఎఫ్ క్వార్టర్స్ సమీపంలోని ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. గురువారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఎఫ్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నామని, ఆక్రమణకు గురవుతున్న స్థలం ఏండ్లుగా ఖాళీగా ఉండేదన్నారు. తాము సదరు స్థలాన్ని క్రీడా మైదానంగా, బహిర్భూమికి వినియోగించేవారమని తెలిపారు. ప్రస్తుతం ఖబ్జాదారులు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. స్థలంలో నిర్మాణాలు జరిపి కరెంటు మీటర్లు, నల్లా కనెక్షన్లు, ఇంటి నెంబర్లు సైతం పొందారన్నారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు ఖబ్జా స్థలాల్లో చేపడుతున్న నిర్మాణాలను ఎఫ్ కాలనీ వాసులు అడ్డుకున్నారు.

నూతన ఎలక్ట్రికల్ లైన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల గ్రామ పంచాయితీ పరిధిలోని జెడ్పీ రోడ్డు పొడవునా ఉన్న ఎలక్ట్రికల్ లైన్ ప్రమాదకరంగా మారిందని నూతన లైన్ ఏర్పాటు చేయాలని యువ నాయకుడు శ్రీనివాస్ కోరారు. గురువారం ఏఈకి వినతిపత్రాన్ని అందచేశాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కరెంటు లైన్ వేసి చాలా సంవత్సరాలు గడుస్తుందన్నారు. రోడ్డు ఎత్తుగా ఉండడంతో బస్సు, లారీ తదితర వాహనాలు వైర్లకు తాకి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం బోర్వెల్ లారీకి వైర్లు తాకి వైర్లు తెగిపోయి పెను ప్రమాదం తప్పిందన్నారు. ప్రమాదకరంగా ఉన్న లైనును వెంటనే సరిచేసి నూతన లైను ఏర్పాటు చేయాలని కోరారు.

ఎలక్ట్రిషన్ టెక్నీషియన్స్‌కు గుర్తింపు ఇవ్వాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో ఉన్న ప్రయివేటు ఎలక్ట్రిషన్ టెక్నీషియన్స్‌కు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ కోరారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రయివేట్ ఎలక్ట్రిషన్ టెక్నీషియన్ ఫెడరేషన్ మండల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిషన్స్ టెక్నీషియన్స్‌కు ప్రభుత్వపరంగా గుర్తింపు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ బిన్ అబ్దుల్ల, మండల అధ్యక్షులు గంగన్న, నాయకులు కాలు, రమేష్, సంతోష్, సురేష్, సాయి, అంకుష్, ఫెరోజ్ పాల్గొన్నారు.

పల్లెల్లో 'ప్రత్యేక' పాలన

- ముగిసిన సర్పంచ్‌ల పదవీ కాలం
- గెజిటెడ్ అధికారులకు ప్రత్యేకాధికారాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పల్లెల్లో ప్రజాప్రతినిధుల కాలం ముగిసింది. ఐదేళ్లుగా సర్పంచ్‌లుగా కొనసాగిన వీరంతా ఇపుడు పదవీచ్యుతులయ్యారు. మాజీ సర్పంచ్‌లుగా మిగిలిపోయారు. శుక్రవారం నుండి పంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాత్రి జిల్లా కలెక్టర్ జారీ చేశారు. 2019, ఫిబ్రవరి రెండో తేదీన సర్పంచ్‌లు ప్రమాణస్వీకారం చేశారు. వీరి పదవీ కాలం 2024, ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసింది. రెండో తేదీన అన్ని పంచాయతీలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే ఆయా మండలాల ఎంపీడీఓలు పంచాయతీలలో ప్రత్యేకాధికారులుగా ఎవరిని నియమించాలనే విషయంలో ప్రతిపాదనలు పంపించారు. ఆయా మండలాలలో ఉన్న గెజిటెడ్ అధికారులను పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించేందుకు ప్రతిపాదించారు. అధికారుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఒక్కో అధికారికి 2, 3 పంచాయతీలను కూడా కేటాయించారు.

గతంలో కూడా ప్రత్యేకాధికారుల పాలనే...

గతంలో 2018 ఆగష్టుతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. వెంటనే ఎన్నికలు జరపాల్సిన ప్రభుత్వం వాయిదా వేసింది. అదే ఏడాది ఆగష్టు రెండో తేదీన ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వీరు ఆరు నెలల పాటు పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా కొనసాగారు. 2019 జనవరిలో ఎన్నికలు నిర్వహించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 334 పంచాయతీ ఉన్నాయి. గత పంచాయతీ ఎన్నికలకు ముందు వరకు జిల్లాలో 173 పంచాయతీలు ఉండగా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మరో 161 పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేసింది. దీనితో జిల్లాలో పంచాయతీల సంఖ్య 334కు చేరుకుంది. వీటికి మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. 21 జనవరి 2019న 113 పంచాయతీలకు, 25న 107 పంచాయతీలకు, 30న 114 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన సర్పంచ్‌లు ఫిబ్రవరి రెండో తేదీన ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని భావించినా, ఇపుడు లోక్‌సభ ఎన్నికలు ఉండడంతో ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు మొగ్గు చూపలేదు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. అప్పటి వరకు పంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

కార్మికుల సంక్షేమం గాలికొదిలిన బీజేపీ ప్రభుత్వం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని, చట్టాలను తుంగలో తొక్కిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవన ఆవరణలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్‌తో కలిసి ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ఉద్యోగ కల్పన పడిపోయిందని, అసంఘటిత రంగ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బీజేపీ నిరంకుశ విధానాన్ని ప్రశ్నించడానికి నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఫిబ్రవరి 16న సమ్మెలో భాగంగా 11వ తేదీన కాగజ్‌నగర్ పట్టణంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి సీఐటీయూ ఆల్ ఇండియా కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, మధు, జయలక్ష్మి పాల్గొంటున్నారన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు అశోక్, నాయకులు ఆనందరావు, కమలాకర్, సదయ్య, రవి, మహేష్, రాజన్న, రామచందర్, అశోక్ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

సమస్యలపై అధికారులు అవగాహన పెంచుకోవాలి

- గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అందని సాగునీరు
- నీరు పుష్కలంగా ఉన్న రైతులకు కష్టాలు
- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

నవతెలంగాణ-బెజ్జూర్

సమస్యలపై అధికారులు అవగాహన పెంచుకొని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కారించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సూచించారు. గురువారం మండలంలోని కుకుడ, కృష్ణపెల్లి, సిద్దాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రంగాపూర్ గ్రామం వద్దగల కుకుడ, కృష్ణపెల్లి వాగులపై సాగునీటి కోసం మంజూరైన చెక్ డ్యాం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందలేదన్నారు. మండలానికి నలుమూలల నీటి వసతి ఉన్నప్పటికీ సాగునీరు అందించలేదని మండిపడ్డారు. వార్ధ నదిపై ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రతిపాదనను సిద్ధం చేశామని, త్వరలో వార్ధ నదిపై ప్రాజెక్టు మంజూరు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాణం పూర్తయితే వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గత పాలకుల తప్పిదాల వల్ల సాగునీరు అందక రైతులు నష్ట పోయారని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు రాకుండా అధికారులు పూర్తి అవగాహనతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మారుమూల గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానన్నారు. చెక్ డ్యామ్‌లో నిర్మాణంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు వన్యప్రాణులకు నీటి వసతి అందుతుందన్నారు. చెక్ డ్యాం పనులు త్వతగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అటవీ భూముల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. పోడు భూము సమస్యలపై మంత్రి సీతక్కతో చర్చించామని దీనికి త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు నీరు అందే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, తాగు, సాగునీరు సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు చేపడతామన్నారు. జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.87 కోట్లు ప్రాజెక్టు పీపీఆర్ ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ. నాలుగు కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ భద్రయ్య, ఏఈఈ అజయ్ కుమార్, ఏఈ ప్రభాకర్, జెడ్పీటీసీ పుష్పలత, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, నాయకులు కొండ్ర మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, పాల్వాయి సుధాకర్ రావు, పాల్వాయి శ్రావణ్, బాలకృష్ణ లింగయ్య, వసీఉల్లాఖాన్, తాళ్ల రామయ్య, నేరెళ్ల సంతోష్, రాజారాం పాల్గొన్నారు.

నేటి సీఎం సభకు పెద్ద ఎత్తున తరలి రావాలి



ఆసిఫాబాద్: మాట్లాడుతున్న భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంద్రవెల్లిలో శుక్రవారం నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు జిల్లా నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కోరారు. సీఎం సభకు జిల్లా బాధ్యతలు తీసుకున్న ఆయనకు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆయన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం ప్రజల తరలింపు ప్రక్రియ కొనసాగాలన్నారు. సభకు వచ్చేవారికి ఎక్కడ కూడా ఇబ్బంది కాకుండా చూడాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఆర్టీసీ ప్రయివేట్ వాహనాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గాదర్ల అశోక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్, నాయకులు మంగ, శ్రావణ్, మల్లికార్జున్, జాఫర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో శుక్రవారం నిర్వహించనున్న సీఎం రేవంత్ రెడ్డి బహిరంగసభకు సిర్పూర్ నియోజకవర్గం నుంచి జనాలు తరలిరావాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కోరారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో పీసీసీ హోదాలో మొదటిసారి ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఇచ్చిన హామీలన్నిటిని సీఎం హోదాలో నెరవేరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్మాజీ సంతోష్, తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరిగే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, పార్టీ మండల అధ్యక్షుడు భూస శంకర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇంద్రవెల్లికి సీఎం రేవంత్ రెడ్డి అధికారిక హోదాలో వస్తున్నారన్నారు. మండలంలోని కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు హకీమ్, నందరాం, రామయ్య పాల్గొన్నారు.



బెజ్జూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీ నిర్వహణకు చర్యలు

- డీఐఈఓ నైతం శంకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) నైతం శంకర్ అన్నారు. గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరీక్షలకు మొదటిసారి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటిరోజు జిల్లా వ్యాప్తంగా ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ఉదయం పరీక్షకు 906 మందికి 793 మంది హాజరయ్యారని, ఇందులో జనరల్ విద్యార్థులు 291మంది, వొకేషనల్ 502 ఉన్నారని, మధ్యాహ్నం సెషన్‌లో 707 మందికి 671 మంది హాజరు కాగా, జనరల్ 244మంది, వొకేషనల్ విద్యార్థులు 427మంది హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, డెక్ కమిటీ మెంబర్ అధియాఖానం, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కండేయ దీక్షల స్వీకరణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని ఓల్డ్ కాలనీలోగల ఉమామహేశ్వర మార్కండేయ దేవాలయంలో గురువారం పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు దాసరి వెంకటేష్ మార్కండేయ స్వామి మాల ధారణ దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా అలయ అర్చకులు పరికిపండ్ల కరుణాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ భక్త మార్కండేయ స్వామి మాలధారణ దీక్షలు భారతీయ సనాతన ఋషి సంస్కృతికి చిహ్నమని, అల్పాయుసుడైన శివ భక్త మార్కండేయుడు పసిప్రాయంలోనే మాలధారణ చేసి, నియమాలను అనుసరిస్తూ పరమేశ్వరుని మహా మృత్యుంజయ మంత్రాన్ని జపించి శాశ్వత చిరంజీవ తత్వాన్ని వరంగా పొందాడని వారు తెలిపారు. ఫిబ్రవరి 12న ఉమామహేశ్వర మార్కండేయ దేవాలయములో భక్త మార్కండేయ జయంతిని గణంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్ కుమార్, ఉపాధ్యక్షులు వంగరి రవి కుమార్, పడాల రాజయ్య, పొట్లబత్తిని సదానందం, గౌరవ సలహాదారులు గాదే వెంకటయ్య, బంక వీరయ్య, ప్రచార కార్యదర్శులు దాసరి నారాయణ, చిందం అశోక్ పాల్గొన్నారు.

గురుకులాల్లో మంచి ఫలితాలు సాధించాలి

- గురుకులం అడ్మిన్ స్పెషల్ ఆఫీసర్ ఏకాంబరం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకుల విద్యార్థులు పది, ఇంటర్‌లో 100 శాతం ఫలితాలు సాధించేలా ప్రణాళికతో కృషి చేయాలని గురుకులం అడ్మిన్ స్పెషల్ ఆఫీసర్ ఏకాంబరం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీటీజీ, గిరిజన బాలికల, గిరిజన డిగ్రీ బాలికల కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపక, ఉపాధ్యాయ సిబ్బందితో వేరువేరుగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని దానికనుగుణంగా గురుకులం సూచనలు పాటిస్తూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు వారిని పరీక్షల కోసం సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు సురేష్, శారద, అనిత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



నవతెంగాణ-రెబ్బన

పోలీసులు మీకోసంలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోండుగూడ వృద్ధులకు రెబ్బన ఎస్సై చంద్రశేఖర్ దుప్పట్లను పంపిణీ చేశారు. గ్రామంలోని 70 మందికి దుప్పట్లు పంపిణి చేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వారం రోజులుగా చలి తీవ్రత పెరుగడంతో వృద్ధుల ఆరోగ్య దృష్ట్యా మానవ దృక్పదంతో దుప్పట్లు అందించామన్నారు. చలికాలంలో వీధుల్లో నిద్రిస్తున్న, పేదవారికి దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు.

ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ నాయకులంతా నేడు జరిగే ఇంద్రవెల్లి సభనువిజయవంతం చేయాలని బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సింగిరెడ్డి హరి వర్ధన్‌రెడ్డి (మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రెసిడెంట్) తెలిపారు. తాండూరు ఐబిలో నాయకులు కార్యకర్తలు సమక్షంలో మాట్లాడారు. రేపు జరగబోయే ఇంద్రవెల్లి సభకు ప్రాముఖ్యత సంతరించుకుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి నుండే ఎన్నికల సమర శంఖం పూరించారని గుర్తు చేశారు. నాయకులు కార్యకర్తలు కలిసి ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సమయానికి సభకు చేరుకోవాలన్నారు. మండల స్థాయి నాయకులు కార్యకర్తల సమీకరణకు సన్నాహకాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల అధ్యక్షుడు ఎండీ ఈస, మదారం ఎంపీటీసీ సూరం రవిందర్ రెడ్డి, తాండూర్ ఎంపీటీసీ సిరంగి శంకర్, సింగిల్ విండో డైరెక్టర్ మసాడి తిరుపతి పాల్గొన్నారు.

ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పసుల వెంకటస్వామి

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పసుల వెంకటస్వామిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోటో భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నల్ల సతీష్ చేతుల మీదగా నియామక పత్రాలు అందుకుని ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకట స్వామి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్, కోశాధికారి బద్రి సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్లకొండ కనకయ్య, జిల్లా అధ్యక్షుడు నల్ల సతీష్, ప్రధాన కార్యదర్శి గని రవీందర్, కోశాధికారి శ్రీపతి రవి, శ్రీరాంపూర్ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మందమర్రి వర్కింగ్ ప్రెసిడెంట్ మణిరాజ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి

- వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాహుల్

నవతెలంగాణ-దండేపల్లి



రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని మంచిర్యాల మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ 18 సంవత్సరాల నుంచి లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలు నడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంవీఐ మాట్లాడుతూ ప్రాణం చాలా విలువైందని వాహనాలు నడిపేటప్పుడు భద్రత ప్రమాణాలు పాటించాలని అన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. దేశ వ్యాప్తంగా నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరిగి ఒక్కరు మృత్యువాత పడుతున్నారని చెప్పారు. డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే సుమారు 90 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రాణ రక్షణకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడుపొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కే.ప్రసాద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే-1ఏ గని సమీపంలో నిర్వహించే సమ్మక్క సారక్క జాతర ఏర్పాట్లను గురువారం మందమర్రి జీఎం మనోహర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు ఆర్కే-1ఏ ప్రాంతంలో సింగరేణి యాజమాన్యం జాతరను నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. 21వ తేదీన సారలమ్మ 22న సమ్మక్కను గద్దేల మీదకు తీసుకురావడం జరుగుతుందని పేర్కొన్నారు. 23వ తేదీన మొక్కులు చెల్లించుకొని 24వ తేదిన మళ్లీ తిరిగి వన ప్రవేశం చేయడం జరుగుతుందని తెలిపారు. సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, ఏజీఎం ఈఅండ్ఎం నాగరాజు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ఆర్కే-1ఎ గని మేనేజర్ జయంత్, ఆర్‌కేపీ ఏరియా సివిల్ డీవైఎస్ఈ ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేసిన సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బందులో రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమ్మెలో పాల్గొంటారని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ కార్యలయంలో నోటీస్ అందశారు. మండలంలోని ప్రభుత్వ వైద్యాధికారి ఉమాశ్రీకి, ఎంపీడీఓ అరుణారానికి గ్రామపంచాయతీ కార్మిక సిబ్బందులు అంగన్‌వాడీ టీచర్లు మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు సమ్మె నోటీసులు అందించారన్నారు. ఈ నెల 16న నిర్వహించే భారత్ బంద్ సమ్మెను అన్ని కార్మిక సంఘాలు ఐక్యమై బందులో పాల్గొనాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం మండల అధ్యక్షులు సేపురు లక్ష్మి, ట్రెజరర్ అయిలవేణి గౌరీ పాల్గొన్నారు.

'హెల్మెట్ పై కాదు.. సేఫ్టీపై దృష్టి పెట్టండి'

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యం హెల్మెట్ పై కాకుండా కార్మికుల రక్షణపై దృష్టి పెట్టాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు గుల్ల బాలాజీ, గోదారి భాగ్యరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులకు రక్షణకు యాజమాన్యం ఇచ్చే(పీపీఈ) రక్షణ పరికరాలైన బూట్లు ఇచ్చినప్పుడు సాక్సులు ఇవ్వకపోవడం, నాణ్యత లేని చేతి గ్లౌజులు ఇవ్వడం, చలికాలం ముగుస్తున్న ఇప్పటికీ సరైనన్ని జెర్కిన్‌లు ఇవ్వడం లేదన్నారు.

సర్పంచులకు ఘన సన్మానం

నవతెలంగాణ-వేమనపల్లి

గత ఐదు సంవత్సరాల నుంచి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో సర్పంచులుగా గెలిచి సేవలు అందించిన మండల సర్పంచులను గురువారం ఎంపీపీ కోలి స్వర్ణలత, ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని సర్పంచులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, డిప్యూటి తహసీల్దార్ గోవింద్ నాయక్, ఎంపీఓ శ్రీపతి బాపురావు, మండల వ్యవసాయ అధికారి వీరన్న, పంచాయితీ రాజ్ ఏఈ శ్రీధర్, నీల్వాయి ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన సీఎంఓఏఐ అధికారులకు సన్మానం

నవతెలంగాణ-మందమర్రి

సీఎంఓఏఐ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన అధికారులను గురువారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం మనోహర్ సన్మానించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన సీఎంఓఏఐ ప్రెసిడెంట్ రమేష్ కేకే ఓసి, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఆర్కే ఓసి మేనేజర్, సెక్రెటరీ ఫైడిశ్వర్ ఎస్ఈ ఏరియా స్టోర్స్, జాయింట్ సెక్రెటరీ నాగవర్ధన్ డిప్యూటీ అండర్ మేనేజర్, నరేష్ డీవైఎస్ ఈఅండ్ఎం, ట్రెజరర్ సుధారాణి ఎఫ్అండ్ఏ, జాయింట్ ట్రెజరర్ సంతోష్ సీనియర్ అండర్ మేనేజర్, డీవైజీఎంఐడీ రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 106 శాతం బొగ్గు ఉత్పత్తి

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

తెలంగాణ-నస్పూర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

జనవరి నెల శ్రీరాంపూర్ ఏరియాలో 106 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనవరి నెలలో 6లక్షల16వేల టన్నులకు గాను 6లక్షల 54వేల టన్నులతో 106 శాతం బొగ్గు ఉత్పత్తి జర్గిందన్నారు. అత్యధికంగా ఎస్ఆర్పీ ఓసీలో 124 శాతం సాధించిందని, అత్యల్పంగా ఎస్ఆర్పీ-3,3ఏలో 65శాతం సాధించిందన్నారు. అలాగే కార్మికుల సంక్షేమానికి రూ.33 లక్షలతో నస్పూర్ డిస్పెన్సరీలో డిజిటల్ ఎక్సరేను ప్రారంభించామని, అలాగే రూ.16 కోట్లతో ఫిబ్రవరి నెలకరు వరకు సింగరేణి ఏరియాలలో శుద్ధ నీటిని అందిస్తామని పేర్కొన్నారు. సోమారం నుంచి ఫిబ్రవరి 11వ తేదీ వరకు అన్ని గనులపై మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

ఆటపాటలతో మానసికోల్లాసం కలుగుతుంది

- ఎస్టీపీపీ ఈడీ బసవరరెడ్డి

నవతెలంగాణ-జైపూర్



ఆటపాటల ద్వార శరీరధారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఎగ్జిగ్యూటీ డైరెక్టర్ బసవరెడ్డి అన్నారు. గత 10 సంవత్సరాల నుండి ఎస్టీపీపీ ఆద్వర్యంలో ఆనవాయితిగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. క్రీడల పట్ల చూపిన ఆసక్తి విధుల పట్ల కూడా చూపించాలని అన్నారు. ప్రతి సంవత్సరం రిపబ్లిక్ డే సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా ఈ ఏడాది అనివార్య కారణాల వలన ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు నిర్వహించడం జరుగుతుందని చీఫ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న పంతుల నాయక్ అన్నారు. మొత్తం 12 జట్లు పోటీల్లో పాల్గొంటుండగా మొదటి రోజు సింగరేణి జట్టుతో తలపడిన పవర్‌మేక్ కంపెనీ జట్టు తలపడి విజయం సాధించినట్లు తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఎస్టీపీపీ ఏజీఎం ప్రసాద్, శ్రీనివాస్, డీజీఎం శివప్రసాద్, కోఆర్డినేటర్లు సుబ్బారావు, ఏపీ సింగ్ పాల్గొన్నారు.

పెద్దనపల్లి గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్ఐ గంగారామ్

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం సోమగూడెం న్యూ కాలని, పెద్దనపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ వేముల కృష్ణ ఏర్పాటు చేసిన 4- సీసీ కెమెరాలను ఎస్ఐ గంగారామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని గ్రామాలను నేరా రహిత గ్రామాలుగా చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, సినిమా రచయిత, నటులు గడ్డం సురేష్, వార్డు సభ్యులు కొత్త రమేష్, పంబాల తిరుపతి, కంచర్ల పద్మ, బన్న హిందుమతి, గ్రామస్తులు బన్న శ్రీనివాస్, శ్రీధర్, శ్యాం, నరేష్ కారోబార్ మురళీలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య బస్సులను సీజ్ చేయాలి

నవతెలంగాణ-హాజీపూర్

బెల్లంపల్లి పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాలలకు ఎలాంటి అనుమతులు లేకున్నా గత సంవత్సరం నుంచి శ్రీరామ పాఠశాల పర్మిషన్‌పైన శ్రీ చైతన్య పాఠశాల నడిపిస్తూ విద్యార్థులని, విద్యార్థి తల్లిదండ్రులని మోసం చేస్తూ న్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. విద్యార్థులను తీసుకురావడానికి ఉపయోగించే బస్సులపైన శ్రీ చైతన్య పాఠశాల అనే పేరు ముద్రించి ఊర్లలోకి పంపించి తీసుకు వస్తున్నారని తెలిపారు. బస్సులపైన పేరు ఉండడం ద్వారా పాఠశాలకు పర్మిషన్ లేనప్పటికీ శ్రీ చైతన్య అనే పేరును చూసి ఈ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు పంపించి మోసపోతున్నారన్నారు. శ్రీ చైతన్య పాఠశాలకు పర్మిషన్ లేకుండా వాహనాలు నడిపిస్తున్న వారి పైన చర్యలు తీసుకోవాలని డీటీఓ కిష్టయ్యను కోరారు.

మంత్రి సీతక్కని కలిసిన సీఎంఓఏఐ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో కొత్తగా ఎన్నికైనటువంటి అధికారుల సంఘం(సీఎంఓఏఐ) ప్రతినిధులు గురువారం మంత్రి సీతక్కను సీసీసీ సింగరేణి గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మంత్రికి తమ యొక్క సమస్యలను తెలిపారు. వారి సమస్యలపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కే.వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్.మహేష్, కె.కిరణ్ కుమార్, సంయుక్త కార్యదర్శులు ఆర్.బీమన్న, గౌస్ పాషా, కోశాధికారి బి రాము, సంయుక్త కోశాధికారి పి.కోటేశ్వరరావు, డీజీఎం (ఐఈ) చిరంజీవులు, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు

నవతెలంగాణ-మందమర్రి

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదిన వేతనాలు వేసి మాట నిలబెట్టుకున్నాడని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మహంత్ అర్జున్ అన్నారు. గురువారం మందమర్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో 22 వ తేదీ వచ్చినా జీతాలు పడక ఉద్యోగులు చాలా ఇబందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి బాధలు పడే పరిస్తితి లేదన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజా పాలనకి ఇది ఒక్క నిదర్శనం అని తెలిపారు.

పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా నతానియేలు

నవతెలంగాణ-నస్పూర్

పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పనిచేస్తున్న తనను ఎంపీగా గెలిపించాలని నతానియేలు కోరారు. గురువారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మాడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో వలస నాయకులను అడ్డుకొని, స్థానికున్ని ఆయన తనను గెలిపించాలని కోరారు. గతంలో ప్రాంతానికి సంబంధం లేని వారు ఎన్నికయ్యారని, అందుకే పెద్దపల్లి నియోజక వర్గం వెనుకబడిందని ఆరోపించారు. వలస రాజకీయ నాయకుల వల్ల పెద్దపల్లి ఎక్కువ వెనుకబడిందని, అన్ని రంగాల్లో నిరాదరణకు గురైందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో వలస నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో ఉంటానని తన అభ్యర్థిత్వాన్ని బలపరచి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో స్వామి, మోహన్ దాస్, దేవ దాస్, కాదసి రాములు పాల్గొన్నారు.

4న సంత్‌సేవాలాల్ క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-జన్నారం

ఈ నెల నాలుగవ తేదీన మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ క్రికెట్ టోర్నమెంటులో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని, సంతు సేవాలాల్ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన క్రీడాకారులకు రూ.2000 ఎంట్రీ ఫీజ్ ఉంటుందన్నారు. గెలుపొందిన మొదటి విజేతలకు రూ.50 వేలు ,రెండవ విజేతలకు రూ.25 వేల బహుమతి ఇస్తారని పేర్కొన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు పాల్గొనాలని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంతు సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు, సందేశ్, రాములు, నందు నాయక్, భీమ్లాల్ పాల్గొన్నారు.

టీపీఎస్ఎఫ్ కాసిపేట మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో పంచాయతీ కార్యదర్శులు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జి.రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా సురేశ్, ఉపాధ్యక్షులుగా కీర్తి, ఉదయ్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా సునీత, మానస, సురేశ్, రాము, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రజిత, సురేందర్, సలహారులుగా శ్వేత, శ్రీధర్, ప్రచార కార్యదర్శులుగా దీప్తి, ముబీన్, ఈసీ సభ్యులుగా మోనిక, తనూజ, అన్నపూర్ణ, సౌందర్యలను ఎన్నుకున్నారు.

పదవీ కాలంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు



కుందారంలో సర్పంచ్ సమ్మయ్యను సన్మానించిన గ్రామస్తులు

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ నిర్వాహణలో సహకరించిన ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మండల పరిధి సర్పంచులు పేర్కొన్నారు. మండల పరిధిలో గల వివిధ గ్రామ పంచాయతీల ఆవరణలో గురువారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికల మీదుగా పంచాయతీ పాలకవర్గాన్ని స్థానికులు శాలువాలతో సన్మానించారు. ప్రజలతో పాటు అధికారుల సహాయ సహకారాలతో ఐదేండ్ల పదవీ కాలం విజయవంతంగా పూర్తి చేసుకున్నామని కుందారం, పౌనూర్ సర్పంచ్ సమ్మయ్య, సారయ్యలు పేర్కొన్నారు.

మాంతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

భీమారం మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు గురువారం స్థానిక మాంతమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిమాన్విత మాంతమ్మ ఆశిస్సులతో ఐదేండ్ల పదవీ కాలంలో ప్రజలతో కలివిడిగా కొనసాగినట్లు సర్పంచులు గద్దె రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దర్శనాల రమేష్, గోదరి తిరుపతి, వాణి బలరాంరెడ్డి, మల్లేష్ తదితరులు పేర్కొన్నారు.

దండేపల్లి : మండలంలోని తాళ్లపేట పంచాయతీ పాలకవర్గానికి గురువారం గ్రామస్తులు, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది ఘనంగా వేడుకలు పలికారు. సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి, పాలకవర్గాన్ని పూలమాలలు, శాలువాతో సత్కరించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తూ అభినందించారు. గత ఐదు సంవత్సరాల పరిపాలనకు సహకరించిన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

జన్నారం : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్రఅని మండలంలోని కామన్పల్లి గ్రామ నాయకులు అన్నారు. సర్పంచ్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో గురువారం కామన్పల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ పేరం మానస, ఉప సర్పంచ్ శ్రీనివాసులను గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రముఖులు శాలువాలు కప్పి సన్మానించారు. కామన్పల్లి గ్రామాన్ని సర్పంచ్, ఉప సర్పంచ్ అభివృద్ధి పథంలో నడిపారని కొనియాడారు. అలాగే మండలంలోని కొత్తపేట గ్రామ సర్పంచ్ మలావత్ లావణ్య ప్రేమ్ సింగ్‌ను గ్రామస్తులు శాలువాపూల మాలలతో సన్మానించారు. అలాగే మండలంలోని కలమడుగు సర్పంచ్ యాదగిరి కార్తిక రావను గ్రామ పెద్దలు శాలువా పూలమాలతో సత్కరించారు.



దండేపల్లి : తాళ్లపేట పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానం

పాహుండి కుపర్ లింగు స్వామి జాతర సన్నాహక సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలోని కుర్రేఘడ గ్రామంలో గురువారం ఫిబ్రవరి 9వ తేది నుంచి 11వ తేది వరకు నిర్వహించే పాహుండి కూపర్ లింగు స్వామి జాతర సన్నాహక సమావేశం నిర్వహించారు. గురుస్వామి భూదేశావ్ స్వామి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండంలోని ఆయా గ్రామాల పటేళ్లు, ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఆదివాసీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ మేరకు జాతర నిర్వాహణకు సంబంధించి చర్చించి కార్యక్రమంపై వివరాలను వెల్లడించి, జాతర నిర్వాహణ కమిటీని నియమించారు. ఫిబ్రవరి 9న జాతర ప్రారంభమైన మొదటి రోజు భజన కార్యక్రమం, 10న అగ్నిగుండం, మాల విరమణ, దర్బార్, పెద్ద పూజ, 11న ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జాతర నిర్వాహణ కమిటీలో అధ్యక్షులుగా ఆడె జంగు, ఉపాధ్యాక్షులుగా వల్క శ్రీను, ఆత్రం అమృత్ రావ్, మడావి గంగారాం, సిడం రాందాస్, జనరల్ సెక్రెటరీగా ఆడె తిరుపతి, కోశాధికారిగా పెంద్రం సింగు, కార్యదర్శులుగా కనక రాజు, మడావి వెంకటేశ్, కుర్సింగ నాగేశ్వర్‌రావు, ప్రచార కార్యదర్శిగా ఆత్రం మహేశ్, సిడం భారిశ్రావ్, ఉయిక మోతీరాం, కార్యదర్శులుగా వల్క శంకర్, కుర్సింగ తిరుపతి, సురేందర్‌తో పాటు సలహాదారులను ఎన్నుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 02, 2024 | www.navatelangana.com

మంత్రికి నవతెలంగాణ డైరీ అందజేసిన ఆర్‌ఎం



నవతెలంగాణ-ఉట్నూర్

నవతెలంగాణ దినపత్రిక ముద్రించిన నూతన సంవత్సర డైరీని మంత్రి సీతక్కకు సంస్థ ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ నాందేవ్ అందించారు. గురువారం మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణం గెస్ట్ హౌస్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నవతెలంగాణ డైరీని అందించారు. జర్నలిస్టులను కాపాడుకునే బాధ్యతలు తమపై ఉందని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. ఇందులో ఉట్నూర్ డివిజన్ ఇన్‌చార్జి గోపి, రిపోర్టర్ జాదవ్ వసంత్‌రావు ఉన్నారు.

మాజీ సీఎంను కలిసిన ఎమ్మెల్సీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ శాసనసభ్యుడిగా బీఆర్ఎస్ఎల్పీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని రాజకీయ పరిస్థితులను, పార్లమెంటు ఎన్నికల్లో పాటించాల్సిన విధి విధానాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ పాల్గొన్నారు.

ఖద్దరు మాటున కబ్జాలు

- సర్సిల్క్ మిల్లు ఖాళీ స్థలాలు ఆక్రమణ
- నిద్రావస్థలో రెవెన్యూ యంత్రాంగం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సర్‌సిల్క్ మిల్లు భూముల్లో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. సర్‌సిల్క్ మిల్లులో పనిచేయని కార్మికేతరులు దర్జాగా కబ్జాలు చేస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి అనుకుని ఉన్న సర్‌సిల్క్ మిల్లుకు చెందిన లిక్విడేటర్ పరిధిలోని భూములను ఆక్రమణలు చేయడమే కాకుండా నిర్మాణాలు సైతం చేపట్టి ఇంటి నెంబర్లు, నల్లాకనెక్షన్లు, విద్యుత్ మీటర్లు పొందారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 1985లో సర్‌సిల్క్ మిల్లు మూతపడే నాటికే కొంత ఆక్రమణకు గురైంది. ఆ తర్వాత 1991లో ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు అధికారికంగా లిక్విడేటర్‌ను నియమించి మిల్లు ఆస్తులు, అప్పులను లెక్కగట్టి యాక్షన్ నిర్వహించింది. యాక్షన్‌లో 156 ఎకరాలకు పైచీలుకు అధికారికంగా ఇవ్వగా మిగిలిన స్థలంపై ప్రస్తుత కబ్జాదారుల కన్నుపడింది. అప్పట్లో కార్మికుల కోసం సర్సిల్క్ ఏరియాలో ఎఫ్ క్వార్టర్స్ పేరిట మిల్లు ఇళ్లను నిర్మించి ఇచ్చింది. దీనిని అనుకుని దశాబ్దాల కాలంగా ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలంపై ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరుల కన్ను పడింది. గతంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి కబ్జాదారులకు అండగా ఉండగా, ఆయన సన్నిహితులు, అనుచరులు యథేచ్ఛగా మిల్లు భూములను ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. సదరు మాజీ ప్రజాప్రతినిధి అండతో కొంత మంది ఏకంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం, కబ్జాలు పెరిగిపోయాయి. అక్కడ ఉన్న కాలిబాట కూడా ఆక్రమణకు గురైంది. విద్యుత్ స్తంబాల వరుసలో ఓ విద్యుత్ స్తంబమున్న స్థలాన్ని కబ్జాచేసి విద్యుత్ స్థంబాన్ని ఇంటి ఆవరణలో కలుపుకుని ప్రహారి నిర్మించారు. ఇంత తతంగం జరుగుతున్నా పట్టించుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం చొరవ తీసుకోవడం లేదు. దీనిపై అసహనానికి గురైన ఎఫ్ కాలనీ వాసులు గురువారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును కలిసి స్థలాల ఆక్రమణ జరగకుండా చూడాలని, నిర్మాణాలపై విచారణ జరిపి చర్యలు చేపట్టేలని కోరారు.

ఉపాధి హామీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ విభాగపు అధికారులతో ఉపాధి హామీ పథకంలోని వివిధ పనులకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న సీసీ రహదారులు, గ్రామపంచాయతీల భవన నిర్మాణాలు, మురుగు కాలువల నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అవసరమైన పనులకు సంబంధించి అంచనా నివేదికలు వెంటనే తయారుచేసి పరిపాలన అనుమతులు పొందాలన్నారు. పనులను ప్రారంభించేముందు పూర్తయిన తర్వాత భువన్ అప్లికేషన్‌లో ఫోటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రత్యేక అధికారుల అనుమతులు పొంది అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి పనులు నిర్దేశించిన గడువు లోపల, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

దళిత ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు బిరుదుల లాజర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని లక్కారం జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నా ఉపాధ్యాయులు ముదుగు సామ్యూల్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన రాకేష్‌తో పాటు దీని వెనక ఉన్న వారిని గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దావుల రమేష్, ఉపాధ్యక్షులు అచ్చ దేవానందం, నాయకులు అరకిల్ల వెంకటేష్, కూటికల ఆరివింద్, నల్ల అజయ్, సంజీవ్, శుక్రాచారి, మాడవి రాములు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు రూపేష్‌రెడ్డి చేయూత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలంలోని గణేష్‌పూర్ వంతెన వద్ద ఎదురెదురుగా ఆటో, ట్రాక్టర్ బుధవారం రాత్రి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పదిమందిలో గణేష్‌పూర్ సర్పంచ్ మడావి భీంబాయితో పాటు మరో ఇద్దరు మహిళలు మడావి సీతాబాయి, కోడప ఆయ్యూబాయికి గాయలయ్యాయి. అర్ధరాత్రి ఒంటి గంటకు ఓ ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి వారికి రాత్రి సీటీ స్కాన్ చేయించి చికిత్స అందేల చూశారు. దీంతో కుటుంబీకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లా సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిర్మల్ జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఫోటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు ఓటరు జాబితా పరిశీలకులుగా నియమించబడిన ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి. భారతి లక్‌పతి నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఉంటుందని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సమావేశానికి కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు హాజరవుతారని, జిల్లా శాఖల సంబంధిత అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

రేపు సోషల్ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 3న జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షులు జి.రవిశంకర్, ప్రధాన కార్యదర్శి జె. లాలాజీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, కేజీబీవీ, టీఎస్ ఎంఎస్ పాఠశాలల నుంచి 10వ తరగతి విద్యార్థులు పరీక్ష రాయవచ్చని తెలిపారు. ఆసిఫాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు టెస్టు ఉంటుందన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో నిర్వహిస్తున్నామన్నారు. నగదు బహుమతులతో పాట ప్రశంసా పత్రాలు అందజేస్తారన్నారు. పూర్తి వివరాలకు సెల్ 9490822812ను సంప్రదించాలని సూచించారు.

బీజేపీ బలోపేతానికే గావ్‌ఛలో

- తొలిసారి ఎలుకపెల్లిలో ఎమ్మెల్యే పర్యటన
- పలువురి చేరిక



నవతెలంగాణ-బెజ్జూర్

క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయడానికి గావ్‌ఛలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే పాల్వాయి హరిష్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే గెలుపొందిన తరువాత తొలిసారిగా మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో పర్యటించారు. కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేయడానికి గావ్‌ఛలో కార్యక్రమంతో ఒక గ్రామం కార్యకర్తలు మరో గ్రామానికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు దగ్గరికి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలన్నారు. విశ్వకర్మ యోజన పథకంతో కులవృత్తుల వారికి అందిస్తున్న రూ.లక్ష రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 14వ తేది వరకు గావ్‌ఛలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎలుకపెల్లి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఆయనకు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించి త్వరలో వాటన్నిటికీ పరిష్కారం చేస్తామని, ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అడవి పందులు పంట పొలాలను నాశనం చేస్తున్నాయని, ఫసల్ భీమా యోజన పథకం పంటల భీమా కల్పించాలని కోరారు. గ్రామ ప్రజలతో తన తండ్రి పాల్వాయి పురుషోత్తం రావుకు సత్సంబంధాలు ఉన్నాయని అదే సంబంధాలను కొనసాగిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ పార్టీల నుండి బీజేపీలో చేరాగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సులుగుపెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కర్పెత రమేష్, ఎన్క శ్రీహరితో పాటు మరో 50 మంది బీజేపీలో చేరారు. అనంతరం సిద్దాపూర్ గ్రామంలో నిర్వహించిన పాల్వాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు మనోహర్ గౌడ్, పాల్వాయి శ్రావణ్, జాడి దిగంబర్, ఉమ్మెర లింగయ్య, కేశెట్టి శ్రీనివాస్, కేశెట్టి సాగర్, కొండవీటి భాస్కర్ రాజు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ఎన్నికలు నిర్వహించాలి



ఆసిఫాబాద్‌లో సర్పంచ్‌లను సన్మానిస్తున్న పాలకవర్గం సభ్యులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధించాలంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వం నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. గ్రామపంచాయతీ సభ్యుల పదవీకాలం గురువారంతో ముగియడంతో మండలంలోని ఈదులవాడ గ్రామ సర్పంచ్ భూసి భీమేష్‌తో పాటు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి సాధించాలంటే పాలకవర్గం అవసరమన్నారు. ప్రభుత్వం ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్రవేణి సావిత్రి మల్లేష్, నాయకులు, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కెరమెరి : మండలంలోని ఖైరి మాజీ సర్పంచ్ లెన్గూరే విజయలక్ష్మి బాలాజీ పదవి కాలం పూర్తి కావడంతో గురువారం ఎస్ఎంసీ కమిటీ ఆధ్వర్యంలో శాలువతో సన్మానించారు. ఈసందర్భంగా ఐదేండ్ల పాటు గ్రామ, పాఠశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత, ప్రధానోపాధ్యాయుడు యోగేష్, ఎస్ఎంసీ చైర్మెన్ మందాడే శివరాం, స్రవంతి,సెండే మహాదేవ్, పాలక్ రావ్, భూత పోచయ్య, దయాకర్, ప్రఫుల్ పాల్గొన్నారు.

రెబ్బన : మండలంలోని గ్రామపంచాయితీల సర్పంచ్ పదవీకాలం ముగియటంతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ సంతోష్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మహమ్మద్ సమీర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 గ్రామ పంచాయితీల సర్పంచులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచులు ఐదేండ్ల పాలన అనుభవాలను గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ వైస్ చైర్మెన్ రంగు మహేష్, కోఆప్షన్ సభ్యుడు జహీరోద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పదవీ పోయింది బిల్లులు ఇప్పించండి

ఐదు సంవత్సరాల పదవీకాలం ముగిసిందని, స్పెషల్ ఆఫీసర్లు వస్తున్నారని, గతంలో మేము చేసిన పనులకు సంబంధించిన బిల్లుల ఇప్పించాలని ఇందిరా నగర్ సర్పంచ్ దుర్గం రాజ్యలక్ష్మి కోరారు. స్వంత ఖర్చులతో గ్రామపంచాయితీ అభివృద్ధికి కష్టపడ్డామన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేశామని కానీ ఇప్పుడు తమ బిల్లులు చెల్లించకుండా పదవికాలం కొనసాగించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. అప్పులు చేసి మరీ పనులు చెపించామన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



రెబ్బెనలో సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు

దళిత సమగ్రాభివృద్ధిపై చిత్తశుద్ధి లేని కేంద్ర బడ్జెట్

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంటు బడ్జెట్ దళితులకు అంకెల్లో పెరుగుదల ఖర్చులో తరుగుదలగా ఉందని దళితుల సమగ్ర అభివృద్ధి పట్ల స్పష్టత లేదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ విమర్శించారు. గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మొత్తం బడ్జెట్ రూ.47,60 కోట్లు కాగా దళితులకు సబ్ ప్లాన్ క్రింద తక్కువ వెచ్చిందిందన్నారు. గతేడాది కేటాయించిన బడ్జెట్‌లో 40శాతం నిధులు ఖర్చు చేయకుండానే మురుగబెట్టారని విమర్శించారు. 102శాఖల ద్వారా ఖర్చు పెడుతున్న ప్రభుత్వం అందరితో కలిపి ఖర్చు చేస్తూ మోసం చేస్తుందన్నారు. దళితుల ప్రత్యక్ష ప్రయోజనాల కోసం సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల విద్య వైద్యం, ఇండ్లు, ఉపాధి విదేశీ చదువులు మౌలిక వనరుల కల్పన కోసం ఖర్చు చేయలన్నారు. ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద 2015 నుండి 2023 వరకు 2,50,084 పక్కాగృహాలు మంజూరు చేసిందని, 224339 ఇండ్లు నిర్మాణం చేసి కేవలం 123933 ఇండ్లు మాత్రమే పంపిణీ చేసిందన్నారు. ఈ సారి బడ్జెట్‌లో రూ.2కోట్ల ఇండ్ల నిర్మాణం చేపడుతామని ప్రగల్భాలు పలుకుతుందన్నారు. సామాజిక న్యాయాన్ని సమాధి చేసే విధంగా రిజర్వేషన్లు రద్దు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించా లని కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నాజిం హుస్సేన్ అన్నారు. గురువారం మండలంలోని బాబాసాగర్‌లోషాబీర్ హుస్సేన్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ డుబ్బులు నానయ్యతో కలిసి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సమయాన్ని వృథా చేయకుండా, క్రీడలు, ఉన్నత చదువులు, ఉద్యోగ సాధనలపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి క్రీడల్లో పాల్గొన్నప్పుడే వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కబడ్డీ పోటీలో మొదటి బహుమతి అందవెల్లికు రూ.10116, రెండో బహుమతి చేడ్ వైకు రూ.7116 అందించారు. వాలీబాల్ మొదటి బహుమతి చింతలమానేపల్లి రూ.10116, రెండవ బహుమతి బాబాసాగర్ రూ.7116 నగదుతో పాటు షీల్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, నాయకులు డుబ్బుల వెంకన్న, శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి శంకర్, షాబీర్ హుస్సేన్ మెమోరియల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని భారతీయ యువశక్తి ట్రస్ట్ ప్రతినిధి పి.మల్లేశ్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం సిర్పూర్ పేపర్ మిల్లు, భారతీయ యువశక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అవసరాలు, వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు భవిష్యత్తులో స్వయం ఉపాధి దిశగా ఆలోచించాలని సూచించారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు ట్రస్ట్ తరపున అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం యువ పారిశ్రామిక వేత్తలకు అందించే వివిధ రుణ సౌకర్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ డి.లక్ష్మినరసింహం మాట్లాడుతూ పర్యావరణ హితమైన పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులకు భారతీయ యువశక్తి, సిర్పూర్ పేపర్ మిల్లు సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజేశ్వర్, జనార్ధన్, దత్తాత్రేయ ట్రస్ట్ ప్రతినిధి శంకర్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 15న మండల కేంద్రంలో నిర్వహజంచే సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఉత్సవ కమిటి నిర్వహకులు ఆహ్వాన పత్రిక అందించారు. గురువారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి ఉత్సవానికి హాజరు కావాలని కోరారు. అదే విధంగా జీసీసీ పెట్రోల్ బంక్ ప్రక్కన ఉన్న సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణం కోసం 5 గుంటల ప్రభుత్వ భూమినీ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ గణేష్, సుధాకర్, నాయకులు, ఉన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

సర్పంచ్‌గా పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్‌కు వివిధ సంఘాల నాయకులు శాలువాతో సన్మానించారు. పదవి కాలం ముగియడంతో గురువారం జీపీ భవనంలో సత్కరించి జ్ఞాపికను అందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉత్తం రాథోడ్, ఫ్యాక్స్ డైరెక్టర్ కాంతరావ్ దుర్గే, ప్రకాష్ చాలుర్కర్, కర్మన్కర్ విఠల్, హరి ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆర్‌ఆర్‌ఆర్ ట్రస్ట్ చైర్మెన్



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌ఆర్ ట్రస్ట్ చెర్మెన్ రాజేష్ జాదవ్ కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కండువ కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేం కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు సయ్యద్ ఎక్బాల్, ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ జైవంత్ రావు, నాయకులు అర్షద్, సయ్యద్ నిసార్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 02, 2024 | www.navatelangana.com

నిజాయితీ చాటుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్



మండలంలోని ఈజ్‌గాం మార్కెట్ ఏరియాలో ఇద్దరు విద్యార్థులకు దొరికిన బ్యాంకు చెక్కుబుక్కు, ఇతర డాక్యుమెంట్లను పోలీస్ స్టేషన్‌లో అప్పగించి తమ నిజాయితీ చాటుకున్నారు. విలేజ్ నెంబర్ 1కు చెందిన ఓ మహిళ గురువారం తన ఎస్‌బీఐ బ్యాంక్ చెక్ బుక్, పాస్ బుక్ ఇతర విలువైన డాక్యుమెంట్స్ పోగొట్టుకుంది. సదరు డాక్యుమెంట్స్ విలేజ్ నెంబర్ 5కు చెందిన విద్యార్థులు తేజస్ దాస్, సాగర్ మిస్త్రిలకు దొరికాయి. ఇద్దరు విద్యార్థులు నిజాయితీగా డాక్యుమెంట్స్‌లను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ సదరు మహిళకు డాక్యుమెంట్స్ అందించారు. నిజాయితీ చాటిన విద్యార్థులను ఎస్సై అభినందించారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని నిరసన

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహ సమీపంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలో ఇచ్చిన మాట ప్రకారం బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని, ఫైర్ స్టేషన్‌తో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడ ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-బోథ్

సీఎం రేవంత్‌రెడ్డి సభకు సందర్భంగా వచ్చిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను బోథ్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. గురువారం సొనాల గ్రామానికి వచ్చిన ఆయనను మున్నూర్ కాపు సంఘ భవనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ ప్రచార విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొనాల గ్రామ అధ్యక్షులు చెట్లపెల్లి అనిల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ రమేష్, పోతన్న, విజయ్ భాస్కర్‌రెడ్డి, పసుల చంటి ఉన్నారు.

సీఈఐఆర్ ద్వారా మొబైల్ ఫోన్స్ అందజేత

నవతెలంగాణ-నిర్మల్

మొబైల్ ఫోన్ పోయిందా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కానీ సీఈఐఆర్ పోర్టల్‌లో గాని ఫిర్యాదు చేయాలని, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు. గురువారం స్థానిక ఎస్పీ పోలీస్ కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్‌లో మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్న బాధితులకు మొబైల్ ఫోన్స్ కనిపెట్టి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో ఈ అప్లికేషన్ ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం ఇప్పటివరకు 492 మొబైల్ ఫోన్‌లను అందజేశామన్నారు. ప్రస్తుతం 63 మొబైల్ ఫోన్‌లను ట్రేస్ చేసి, వాటి యజమానులకు ఇవ్వడం జరిగిందన్నారు. మొబైల్ ఫోన్ జాగ్రత్తగా ఉంచుకోవాలని, నేరస్తులు దొంగలించబడిన మొబైల్ ఫోన్లను దుర్వినియోగం చేసి అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐ సైలేందర్, ఐటీ కోర్ ఎస్సై రవి కుమార్, ఆర్ఎస్సై వినోద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు తీవ్ర నిరాశ కల్పించిన బడ్జెట్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కేంద్రం ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులకు తీవ్ర నిరాశను కలిగించిందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. వేతన వర్గాల్లో తీవ్ర నిరాశ పరచిన బడ్జెట్ అని దుయ్యబట్టారు. వరుసగా మూడు సంవత్సరాలుగా స్లాబ్ రేట్లు మార్చకుండా కొనసాగిస్తూ, ఉద్యోగ వర్గాలను కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురి చేసిందని పేర్కొన్నారు. సేవింగ్ పరిధి కూడా గత మూడు సంవత్సరాలుగా 1,50,000ని కొనసాగిస్తూ వేతన జీవులు దాదాపు రెండు నెలల వేతనం టాక్స్ రూపంలో తిరిగి కట్టించుకుంటున్నారని మండిపడ్డారు.

సర్పంచ్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-బేల

మండలంలోని పాటన్ గ్రామసర్పంచ్‌గా గత ఐదు సంవత్సరాల నుంచి మంచి సేవలు అందించినందుకుగాను గురువారం గ్రామస్తులు సర్పంచ్‌ను, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఫైజుల్లా ఖాన్ మాట్లాడుతూ తన ఐదు సంవత్సరా పదవీ కాలంలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించడం జరిగిందని తెలిపారు. ఏదైనా విధి నిర్వహనలో ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉంటే క్షమించాలని సర్పంచ్ భావోద్వేగానికి గురయ్యాడు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగేష్ ఠాక్రె, తన్విర్ ఖాన్, విశాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

వారసంత కొరకు షెడ్ మంజూరు

నవతెలంగాణ-ముథోల్

ఎన్నోయేండ్లుగా ముథోల్ రైతుబజార్ ఏర్పాటుకు ఎదురుచూస్తున్న ప్రజల కోరిక మేరకు షెడ్డు మంజూరైంది. ముథోల్ మండల కేంద్రంలోని వారసంత అంగడిబజార్‌లో వ్యాపారం చేసే వారికీ, మహిళలకి వర్షాకాలంలో వ్యాపారం చేయడానికి, కూరగాయలు అమ్మేవారికి, కొనేవారికి ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా నాబార్డ్ ఆర్థిక సహకారంతో ముథోల్ గ్రామీణ సంత నిర్మాణానికి గ్రామ పంచాయతీ అభ్యర్థనమేరకు నాబార్డ్ నుంచి ఆమోదం లభించింది. గురువారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ చేతులమీదుగా సీఆర్డి నిర్మల్ జిల్లా బాధ్యులు కిరణ్ కుమార్, సీఓ రాజు, రూరల్ మార్కెట్ షెడ్ సాంక్షన్ పత్రాన్ని ముథోల్ సర్పంచ్ రాజేందర్‌కి అందించారు. త్వరలో నిర్మాణ పనులని మొదలుపెట్టి మార్కెట్ షెడ్‌తో పాటు మరుగుదోడ్లు పార్కింగ్, ఇతరత్రా వసతులు ప్రజలకి మార్కెట్‌లో అందుబాటులోకి తేవడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జ్ తాటివార్ రమేష్, నాయకులు మోహన్‌రెడ్డి, సపటోల్ల పోతన్న పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో అదనపు కలెక్టర్ తనిఖీ

నవతెలంగాణ-జన్నారం

ఎంపీడీఓ కార్యాలయాన్ని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఆయన ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి వివిధ రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో పంచాయతీలకు ప్రత్యేక అధికారాల నియామకంపై తయారు చేసిన జాబితాను ఆయన పరిశీలించారు. సర్పంచుల వద్ద నుంచి రికార్డులు స్వాధీనం చేసుకోవాలని సూచించారు. సర్పంచులు లేనందున ఇక ముందు నుంచి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎంపీడీఓ అరుణ రాణి, ఎంపీఓ రమేష్ పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులకు ఘన సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అంకోలి గ్రామంలో గురువారం సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఫిబ్రవరి 2 శుక్రవారం సర్పంచ్ వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో గ్రామస్తులందరూ కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాలు గ్రామాభివృద్ధికి కృషి చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనక రమణ, గొర్ల కాపరుల సంఘం అధ్యక్షులు గంగయ్య యాదవ్, కిషన్ పాల్గొన్నారు.

రగ్బీ క్రీడలను ప్రారంభించిన ఎస్ఐ రాజేష్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని విశ్వశాంతి హై స్కూల్లో గురువారం అండర్-14 జిల్లా స్థాయి రగ్బీ బాలబాలికల ఎంపిక పోటీలను శ్రీరాంపూర్ ఎస్ఐ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ భీమిని రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్, ప్రిన్సిపాల్ మహేందర్, రమేష్, పీఈటీలు రాజలింగు, వంగ కుమార్, నాయకులూ ఆవునూరి సురేష్, గంధం ప్రణీత్, సీనియర్ క్రీడాకారులు బానేష్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట

- జిల్లాలో హస్తం పార్టీకి మళ్లీ పూర్వ వైభవం
- ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేదని, మళ్లీ తమ పార్టీ పూర్వ వైభవం సంతరించుకుంటోందని ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వచ్చిన ఆయన గురువారం జిల్లాకేంద్రంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమరశంఖం ఇంద్రవెల్లి పురిటిగడ్డ నుండే పూరించటం జరిగిందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో అధికారంలో కొచ్చాక మళ్లీ పార్లమెంట్ ఎన్నికల సమరశంఖారావాన్ని పూరించనున్నట్టు స్పష్టం చేశారు. ఇంద్రవెల్లి అమరుల స్తూపం వద్ద నిర్వహించే బహిరంగ సభకు పార్టీ శ్రేణులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాలపై తమ అధిష్టానం ఫోకస్ చేస్తోందన్నారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని ఖచ్చితంగా గెలిచి సోనియమ్మకు కానుకగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల అమలు ఇప్పటికే మొదలైందన్నారు. మిగతా గ్యారంటీలను సైతం తమ ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని భరోసా కల్పించారు. ఉమ్మడి జిల్లాలో అనుకున్న స్థాయిలో విజయం సాధించకపోవటానికి కొన్ని కారణాలున్నప్పటికీ అవేమీ పార్లమెంటు ఎన్నికల్లో పునరావృతం కాబోవన్నారు. ఈ మీడియా సమావేశంలో సభ ఇన్‌చార్జి పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకటరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ దిగంబర్ రావు పాటిల్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్ ఉన్నారు.

రేపు ఢిల్లీలో జరగబోయే ర్యాలీని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడాం సాయికుమార్ డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా ఫిబ్రవరి 3న ఢిల్లీలో జరగబోయే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని కుమురం భీం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రభుత్వం విద్యారంగంపై నయా మనువాద, నయా ఉదారవాదదాడులను అమలు చేస్తుందన్నారు. 2020లో తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ప్రగతి నిరోధకంగా ఉందన్నారు. నరేంద్ర మోడి ఈ విధానాన్ని రాష్ట్రాలతో చర్చించకుండా, పార్లమెంట్ ఫెడరల్ విధానాలను తుంగలో తొక్కి, దేశ ప్రజలపై అన్యాయంగా రుద్దుతుందన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన సోషలిస్టు, సెక్యులరిజం అనే పదాలు ఉండకుండా, ప్రాథమిక హక్కులు ఉండకుండా చేస్తుందన్నారు. విద్యా వ్యాపారికరణ, కార్పొరేటీకరణ అడ్డు అదుపు లేకుండా చేసేవిధంగా నూతన జాతీయ విద్యా విధానం ఉందన్నారు. ప్రభుత్వ స్కూలు, కాలేజీలు, యూనివర్సిటీలలో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించే పాఠ్యాంశాలను తొలగించడం జరుగుతుందన్నారు. దీనివలన విద్యార్థుల ఉపాధ్యాయుల అధ్యాపకుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే విద్యా సంస్థలోకి బీజేపీ సంఘ్ పరివార్ కార్యకర్తలను ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, పాఠశాలలో, విద్యాలయాల్లో, వాలంటీర్లు కౌన్సిలర్ల పేరు మీద కార్యకర్తలను చెప్పించడం ఈ విధానంలో భాగమని తెలిపారు. ఈ పెను ప్రమాద నూతన జాతీయ విద్యా విధానం దాడులకు అడ్డుకట్ట వేయడానికి ఫిబ్రవరి 3న ఢిల్లీలో అఖిల భారత నిరసన ర్యాలీ జరగబోతున్నదని ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్ అశోక్, జైతు కుమార్, దుర్గాప్రసాద్, కోశాధికారి నిఖిల్, జిల్లా నాయకులు మహిపాల్, మహేష్, సిద్దులు పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



కంది రైతులకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం, గిటుబాటు ధర కల్పించాలనే ఆశయంతో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రంలో పారదర్శకత పాటించాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గురువారం కొత్తపేట పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో జెడ్పీ ఇన్‌చార్జి చైర్మెన్ కోనేరు కృష్ణాతో కలిసి కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన కందులను దళారులకు విక్రయించకుండా ఈ కేంద్రంలోనే అమ్ముకోవాలన్నారు. వానకాలం, యాసంగిలో రైతులు ఏఏపంటలు ఎంత విస్తీర్ణంలో వేశారనే వివరాలు మండల వ్యవసాయాధికారుల వద్ద ఉండాలని సూచించారు. ఈ ఏడాది జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు పత్తి పంట వేసినందున సీసీఐకి విక్రయించుకోవడానికి కొంత ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కందుల కొనుగోలు కేంద్రంపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాల్సి బాధ్యత మార్క్‌ఫెడ్ అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, మార్క్‌ఫెడ్ డీసీఎం ప్రవీణ్ రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి సిద్దంశెట్టి బాస్కర్, ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ తిరుపతిగౌడ్, అసిస్టెంట్ రిజిస్టర్ శ్యాముల్, ఏఓ రామకృష్ణ సీఈఓలు ముక్తావార్ సతీష్, నాయకులు మౌల్కర్ లక్ష్మణ్, కె. రాజన్న, సిందం శ్రీనివాస్, చన్నపురి గణపతి, దెబ్బటి శ్రీనివాస్, వీరభద్రచారి, ఆరికిల కుమార్, కరడి రవిందర్, ఏఈఓలు పాల్గొన్నారు.

50 గ్రాముల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-తలమడుగు

మారుమూల గిరిజన గ్రామమైన షేర్‌గూడకు చెందిన పెందూర్ తరుణ్, అల్వాల్ కిషోర్ వద్ద నుండి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. గురువారం అనుమానస్పందంగా ఉండడంతో వీరిని తనిఖీ చేసి వారి వద్ద నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ దాదాపు రూ. పదివేల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చించాలలో ముగిసిన అఖండ హరినామ సప్తాహం

- ప్రత్యేక పూజలు చేసిన ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని చించాల గ్రామంలోని హనుమాన్ మందిరంలో గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న అఖండ హరినామ సప్తహం గురువారం నాటికి ముగిసింది. ముగింపు సందర్భంగా శ్రీ నారాయణ మహారాజ్ యాతల్‌కర్ కాళకీర్తన నిర్వహించారు. ప్రతి మానవుడు జీవిత గమనంలో ఆధ్యాత్మిక చింతనతోనే మానవజన్మ సార్థకమవుతుందని అన్నారు. భక్తి భావంతో జీవితం ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాజులకు భజన మండలి సభ్యులకు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సప్త ముగింపు సందర్భంగా జాతర కొనసాగింది. జాతరకు వచ్చిన భక్తులకు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సాగౌడ్, టి.రమేష్, కోరి పోతన్న మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, ఎంపీటీసీ ఆత్మస్వరూప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్ ఉద్యోగ నియామకాల్లో అక్క చెల్లెళ్ల ప్రతిభ

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన లచ్చిరామ్ పార్వతిల కుమార్తెలు జాదవ్ శోభ, జాదవ్ జ్యోతిలు స్టాఫ్ నర్స్ పరీక్షలు రాసి ఉద్యోగానికి ఎంపిక అయ్యారు. స్టాఫ్ నర్స్ ఉద్యోగం కోసం ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియమకాల్లో ఉద్యోగం సాధించి, ప్రభుత్వ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. వీరి తండ్రి లచ్చిరామ్ గిరిజన సంక్షేమ వసతి గృహంలో చిరు ఉద్యోగం చేస్తూ రిటైర్ అయ్యారు. కష్టపడి తన ఇద్దరు కూతుర్లను చదివించారు. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తమ తండ్రీ ఆశయాన్ని సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఒకే ఇంట్లో ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన సందర్భంగా స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పౌజియ షబ్బీర్ పాషా యువతులను అభినందించారు.

హామీ మేరకు రెగ్యులర్ చేయాలి

ఉట్నూర్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని ఎన్‌హెచ్ఎం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు కోరారు. గురువారం కేబీ కాంప్లెక్స్‌లో ఇన్‌చార్జి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతిపత్రం అందించారు. ఎన్ఎహెచ్ఎం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు జిల్లాలో 543 మంది 20 సంవత్సరాల నుండి ఆరోగ్య శాఖలో సేవలను గుర్తించి ఎన్నికల మేనిఫెస్టో సమయంలో ఇచ్చిన రెగ్యులరైజెషన్ హామీని నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దొంతుల ప్రవీణ్, సెక్రటరీ గితేష్, జైవంత్, ఉపాధ్యక్షులు నాగభూషన్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కాసిపేట : మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన చిత్రం రాజును కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అల్క రాజు ఆధ్వర్యంలో సన్మానించారు. మల్కేపల్లి ఆశ్రమోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాజు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నాడు. దీంతో విద్యార్థిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

జేఎల్ఎం ఉద్యోగుల భర్తీ ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కొన్నెండ్ల క్రితం కోర్టు తీర్పుతో వాయిదాపడిన జేఎల్ఎం ఉద్యోగుల భర్తీ ప్రక్రియను మళ్లీ చేపట్టారు. గతంలో రిజర్వేషన్ విషయమై పలువురు జేఎల్ఎం అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టులో కేసు ఉన్న కారణంగా భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 మందికి భర్తీ విషయంలో తాజా కోర్టు ఆదేశాలతో ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని ఎస్ఈ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పోల్ క్లైమింగ్ పరీక్షకు 43 మందిలో 5 గురు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ జేఆర్ చౌహన్ మాట్లాడుతూ అభ్యర్థులకు పోల్ క్లైమింగ్ పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు. ఇక్కడ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారి వివరాలను హెడ్ ఆఫీసుకు పంపిస్తామన్నారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం భర్తీ ఉంటుందని తెలిపారు.

సీఎం సభకు తరలిరావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

నేడు జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని మీటింగ్ ఇన్‌చార్జీ రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రామాయి గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పాల్గొని కాంగ్రెస్ శ్రేణులను సమాయత్తం చేశారు. సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలన్నారు. రేవంతన్న అందిస్తున్న సుపరిపాలనను ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు బాయిన్‌వార్ గంగారెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-కడెం

ఐదు సంవత్సరాలు సర్పంచ్ పదవీ విజయవంతంగా నిర్వర్తించి, పదవీ విరమణ పొందిన నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న చేసిన విశిష్ట సేవలను గుర్తించి గురువారం నచ్చన్‌ఎల్లాపూర్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎం ప్రతాప్ సింగ్, హెచ్ఎం భీమాలింగం ఆధ్వర్యంలో సర్పంచ్ బొడ్డు గంగన్నను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్పంచ్‌గా బొడ్డు గంగన్న పాఠశాలకు చేసిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, పాత మద్దిపడగా, మున్యాల, లింగాపూర్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు షేక్ ఉస్సేన్, వామన్ రావు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, శశికాంత్, కార్యదర్శి రమాదేవి, ఎఫ్ఏ కమలాకర్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, కారోబారి మహేందర్, వెంకటేష్, బుచ్చవ్వ, ఎస్ఎంసీ చైర్మెన్ రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళల ప్రసవాలు

నవతెలంగాణ-సిరికొండ

108 అంబులెన్స్‌లో ఒకే రోజు వేర్వేరుగా రెండు ప్రసవాలు జరిగాయి. గురువారం మండలంలోని వాయిపేట్ గ్రామానికి చెందిన వనిత, జెండాగూడ గ్రామానికి చెందిన గంగాదేవి గర్భిణులను అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రసవించారు. ఇద్దరూ ఆడ పిల్లలకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం ఇచ్చోడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఈఎంటిలు సురేష్, కాశీనాథ్, పైలట్‌లు గోపీనాథ్, రవీందర్ తెలిపారు.

అధికారులకు సమ్మె నోటీసులు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో ఈ నెల 4న జిల్లా సదస్సుతో పాటు ఈ నెల 16న అన్ని కేంద్ర, రాష్ట్ర కార్మిక రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే సమ్మెకు సహకరించాలని కోరుతూ వివిధ శాఖల అధికారులకు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేశారు. సమ్మెకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, జిల్లా కార్యదర్శి దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆపరేషన్ స్మైల్ 10 కార్యక్రమం జనవరి 1 నుంచి 31 వరకు జిల్లాలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఈ నెల రోజులలో 69 మంది బాల కార్మికులను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అందులో 62 మంది బాలురు, 07 మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. నిర్మల్ డివిజన్ పరిధిలో మొత్తం 43 మంది, భైంసా డివిజన్ పరిధిలో మొత్తం 26 మంది ఉన్నారని వెల్లడించారు. బాలకార్మికుల యజమానులకు, బాల కార్మికుల తల్లిదండ్రులను పిలిపించి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని వివరించారు. జిల్లాలో 18 సంవత్సరాలలోపు పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్న, వ్యవసాయ పనుల్లో ఉన్న, పశువుల కాపరులుగా, కిరాణం షాప్‌లలో, మెకానిక్ షాపులలో, హోటళ్లలో కార్మికులుగా పనిచేస్తున్న, రోడ్డుపై భిక్షాటన చేస్తున్న, ఇటుక బట్టీలలో, పౌల్ట్రీ ఫామ్‌లలో, మరే ఇతర ప్రదేశాలలో ఉన్న, తప్పిపోయిన వదిలివేయబడిన పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్న పిల్లలు ఉన్నట్లయితే అలాంటి వారిని, తల్లిదండ్రులు తమ తాత్కాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పిల్లల భవిష్యత్తును నాశనం చేయరాదని సూచించారు. జిల్లాలో ఎవరైనా బాలకార్మికులను పనిలో పెట్టుకున్న, శారీరకంగా మానసిక, లైంగికగా గురవుతున్న, బాలకార్మికులను చూసినప్పుడు, హింసకు బెదిరింపులకు గురవుతున్న వీధి బాలలను చూసినప్పుడు, సంబంధిత పోలీసు అధికారులకు, 1098 లేదా డయల్ 100, ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్-10 బృందంలో పని చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని, వివిధ శాఖల అధికారులను అభినందనలు తెలిపారు.

నేటి నుండి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన వైపు మొగ్గు చూపింది. దీనిలో భాగంగా నేటి నుండి గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. జిల్లాలోని 334 గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్ ఉత్తర్వులు విడుదల చేశారు. దీనిలో మేజర్ గ్రామపంచాయతీలకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించగా తహసీల్దార్, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీఓ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, వ్యవసాయ ఏఓ, ఎంఈఓలకు ఒక్కొక్కరికి మూడు నుండి ఐదు చొప్పున గ్రామపంచాయతీలు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.